www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 18-1-2025

Visakhapatnam | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విశాఖపట్నం

నేడు 'స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్'

- సీఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహణ
- జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యంత పరిశుభ్రత కలిగిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చదిద్దాలనే లక్ష్యంతో శనివారం నిర్వహించనున్న 'స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ జాహ్నవి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ప్రతి నెల మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్రా- స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు, సిబ్బంది, ప్రజలు పాలుపంచుకోవాలని ఆమె కోరారు.

నేడు వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

భారీ ఎత్తున ఏర్పాట్లు

- విద్యుద్దీపాలు, పూలమాలలతో ఆలయం అలంకరణ
- పలుచోట్ల భారీ విద్యుత్ సెట్టింగులు
- ఆర్టీసీ బస్సులు దారి మళ్లింపు



వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఆలయం (ఇన్‌సెట్‌లో) కొలువుదీరిన గౌరీ పరమేశ్వరులు

అనకాపల్లి పట్టణంలోని వేల్పులవీధి (మెయిన్ రోడ్డు) గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలదండలతో అలంకరించారు. సుదీర్ఘ చరిత్ర వున్న వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఏటా సంక్రాంతి తరువాత వచ్చే శనివారంనాడు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాది ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారుజామున గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల కారణంగా శనివారం ఆర్టీసీ బస్సులను మళ్లింపు మార్గాల్లో నడపనున్నట్టు ఇన్‌చార్జి డీఎం రవిచంద్ర చెప్పారు. (-వార్త 4వ పేజీలో)

లా వర్సిటీలో హైకోర్టు సీజే

- కులపతి హోదాలో జనరల్ కౌన్సెల్ సమావేశం నిర్వహించిన జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్
- విద్యార్థినుల వసతిగృహాలు ప్రారంభం
- హాస్టళ్ల నిర్వహణ, మెనూ అమలుపై పలు సూచనలు

సబ్బవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శుక్రవారం ఇక్కడ దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం సుమారు నాలుగు గంటలపాటు విశ్వవిద్యాలయంలో గడిపారు. కులపతి హోదాలో జనరల్ కౌన్సెల్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల కోసం కొత్తగా నిర్మించిన రెండు వసతిగృహాలను ఆయన ప్రారంభించారు. అన్ని హాస్టళ్లను పరిశీలించి, విద్యార్థుల భోజన, వసతి సదుపాయాల గురించి సమీక్ష చేశారు. వసతుల మెరుగునకు తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. విద్యార్థుల మెస్ కమిటీ పనితీరును సమీక్షించారు. వసతిగృహాల్లో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియంను సీజే పరిశీలించారు. ఆయన వెంట హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మాదాసు, చీఫ్ వార్డెన్ భాగ్యలక్ష్మి వున్నారు.

విద్యార్థినుల వసతిగృహం ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



మందగించిన ధాన్యం కొనుగోళ్లు

తేమ అధికంగా ఉందంటూ సేకరణకు విముఖత చూపుతున్న సిబ్బంది

- 17 శాతానికి మించకూడదని ప్రభుత్వ నిబంధన
- 25 శాతం వరకు వుండడంతో కొనుగోళ్లకు నిరాకరణ
- వాతావరణ పరిస్థితులే కారణమంటున్న రైతులు
- తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయం

అనకాపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. వరి కోతల సమయంలో, అనంతరం అకాల వర్షాలు కురవడం, నూర్పులు ఆసల్యంగా మొదలు కావడం, సంక్రాంతి పండుగ రావడంతో ఈ పరిస్థితి నెలకొంది. వీటికితోడు ధాన్యంలో తేమ శాతం అధికంగా వుందంటూ పౌరసరఫరాలు, ఇతర శాఖల సిబ్బంది సేకరణకు విముఖత చూపడం కూడా ఒక కారణంగా తెలుస్తున్నది. మొత్తం మీద ఇంతవరకు లక్ష్యంలో మూడో వంతు మాత్రమే ధాన్యం కొనుగోళ్లు జరిగాయి.

గత ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 56,410 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. సుమారు 92 వేల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల కుటుంబ అవసరాలు, వచ్చే సీజన్‌లో పంట వేయడానికి అవసరమైన విత్తనాలు, ప్రైవేటు వ్యాపారులకు అమ్మకాలుపోను కనీసం 30 వేల టన్నుల ధాన్యం సేకరించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు జిల్లాలో 72 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాస్తవంగా నవంబరు చివరి నుంచే ధాన్యం సేకరణ ప్రారంభం కావాలి. అయితే గత ఏడాది ఖరీఫ్‌లో వరినాట్లు ఆలస్యం కావడం, పంట కోతకు వచ్చిన సమయంలో సుమారు మూడు వారాలపాటు బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండాలు, తుఫాన్ కారణంగా వర్షాలు పడడంతో వరి కోతలు, నూర్పుల పనులకు ఆటంకం కలిగింది. వారం నుంచి పది రోజుల వరకు ఆలస్యంగా కోతలు కోశారు. వాతావరణం మసుగ్గా వుండడంతో వరి పనులు ఆరడానికి ఎక్కువ రోజులు పట్టింది. దీంతో కుప్ప, నూర్పుల పనులు కూడా జాప్యం అయ్యాయి. మొత్తం మీద డిసెంబరు రెండో వారం నుంచి వరి నూర్పిడి పనులు మొదలయ్యాయి. చివరి వారం నుంచి ఊపందుకున్నాయి. ఈ కారణాల వల్ల రైతులు ధాన్యం అమ్ముకోవడం ఆస్యమైంది. ఆ ప్రభావం పౌరసరఫరాల శాఖ ధాన్యం సేకరణపై పడింది. గురువారం సాయంత్రం వరకు జిల్లాలోని అన్ని కేంద్రాల్లో 9,192 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. సంక్రాంతి పండుగ కారణంగా గత ఆదివారం నుంచి వరి నూర్పు పనులు దాదాపు ఆగిపోయాయి. ఐదు రోజుల తరువాత శుక్రవారం నుంచి నూర్పులు మొదలుపెట్టారు.



కె.కోటపాడు మండలం గవరపాలెంలో ధాన్యం సేకరిస్తున్న సిబ్బంది

అధిక తేమ శాతంతో సమస్య

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యంలో తేమ 17 శాతంకన్నా తక్కువ వుండాలి. అయితే వరి పంట కోతకు వచ్చిన సమయంలో ... మిగతా 4వ పేజీలో

ఉక్కుకు మంచి రోజులు

మాట నిలుపుకున్న కూటమి నేతలు

- రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం
- తక్షణం రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూస్తామని ప్రకటన
- ఆగస్టు నుంచి మూడో బ్లాస్ట్ ఫర్నేస్ అందుబాటులోకి...
- ఐరన్‌ఓర్ సరఫరాకు ఎన్ఎండీసీతో చర్చలు
- ఇక ఉత్పత్తి పరుగులే
- కార్మిక వర్గాల హర్షం
- వీఆర్ఎస్‌పై వెనక్కి తగ్గుతున్న ఉద్యోగులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'విశాఖ ఉక్కు...ఆంధ్రుల హక్కు' అనే మాట పదికాలాలు నిలిచేలా కూటమి ప్రభుత్వం చేసింది. ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న స్టీల్‌ప్లాంటుకు భారీ ప్యాకేజీ ప్రకటించింది. తక్షణమే రెండు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు పూర్తికాలం పనిచేసేలా, ఆగస్టు నుంచి మూడో బ్లాస్ట్ ఫర్నేస్ అందుబాటులోకి వచ్చేలా చూస్తామని వెల్లడించింది. విశాఖ ఉక్కు ఉద్యోగుల సంఘం, కార్మిక సంఘాలు రూ.15 వేల కోట్ల ఆర్థిక ప్యాకేజీ కోరగా...రూ.11,440 కోట్లు ఇస్తున్నట్టు శుక్రవారం తెలిపింది. దీనికంటే ముందు రూ.1,650 కోట్లు అందజేసింది. అయితే సెయిల్‌లో విలీనం చేయాలనే తమ ప్రధాన డిమాండ్‌ను పట్టించుకోలేదని సీఐటీయూ వంటి కార్మిక సంఘాలు తటస్థ వైఖరి అవలంబించగా మిగిలిన సంఘాలన్నీ ఈ నిర్ణయాన్ని హర్షిస్తున్నాయి. స్టీల్‌ప్లాంటుకు కష్టాలు తొలగిపోయినట్టేనని, ఇక అన్నీ మంచిరోజులేనని సంతోషం వ్యక్తంచేస్తున్నాయి. కేంద్రం భారీ ప్యాకేజీ ప్రకటించడంతో వైసీపీ నేతల నోట్లో పచ్చి వెలక్కాయ పడినట్టయింది. వైసీపీ హయాంలో స్టీల్‌ప్లాంటుకు రూపాయి కూడా సాయం చేయకపోవడమే దీనికి కారణం.

కూటమి నేతలు సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు, తదితరులంతా స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని, ఆర్థిక సాయం కోసం ప్రయత్నం చేస్తామని కార్మిక, ఉద్యోగ సంఘాలకు స్పష్టమైన భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఎన్నికల ఫలితాలు వెల్లడైన మరుసటిరోజు నుంచే ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వం ఏర్పాటైన మొదటి ఆరు నెలల వ్యవధిలో రూ.1,650 కోట్ల సాయం వచ్చేలా చేశారు. ఇప్పుడు భారీ ప్యాకేజీ ఇచ్చేలా ఢిల్లీ పెద్దలను ఒప్పించారు. ఇటీవల ప్రధాని మోదీ విశాఖ వచ్చినప్పుడు స్టీల్ ప్లాంటు గురించి మాట్లాడలేదని, సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు కూడా ఈ సమస్యను ప్రస్తావించలేదని విమర్శలు చేసిన రాజకీయ, కార్మిక సంఘ నాయకులు ఇప్పుడు నోరు మెదపలేకపోతున్నారు.

జీతాలు అందుతాయి... ఉద్యోగాలు నిలుస్తాయి

ఇన్నాళ్లూ ఉత్పత్తికి అవసరమైన ముడిపదార్థాలు కొనుగోలు ... మిగతా 4వ పేజీలో

అన్నదాతలకు ఊరట

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- నెలల తరబడి ఎదురు చేస్తున్న రైతులకు తీపికబురు
- దరఖాస్తుల ప్రాధాన్యతా క్రమంలో కనెక్షన్లు బిగింపు
- గత జూలై వరకూ క్లియర్



వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న ఈపీడీసీఎల్ సిబ్బంది



విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన వ్యవసాయ బోరు

చోడవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు దరఖాస్తు చేసి, నెలల తరబడి ఎదురుచూస్తున్న అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. పెండింగ్‌లో వున్న దరఖాస్తులకు ప్రాధాన్యతా క్రమంలో విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ విషయం తెలుసుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు.

సాగునీటి వనరులు లేని ప్రాంతాల్లో రైతులు పంటలు పండించుకోవాలంటే వర్షంపైనే ఆధారపడాలి. ఇటువంటిచోట్ల బోర్లు వేసుకుని, విద్యుత్ మోటార్లను బిగించుకుంటే ఏటా రెండు పంటలు పండించుకునే అవకాశం వుంటుంది. దీంతో పలువురు రైతులు ఖర్చుకు వెనుకాడకుండా బోర్లు వేయించుకుంటున్నారు. అయితే విద్యుత్ కనెక్షన్ వుంటే తప్ప బోర్లను వినియోగించుకోలేరు. విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేస్తే.. నెలల తరబడి వేచి వుండాల్సి వస్తున్నది. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచితంగా కరెంటు ఇస్తుండడంతో చిన్న, సన్నకారు రైతులు కూడా తమ భూముల్లో బోర్లు వేయించుకుంటున్నారు. దీంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వస్తున్నాయి. స్థానిక సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్నిబట్టి ఈపీడీసీఎల్ అధికారులు ప్రాధాన్యతా క్రమంలో వ్యవసాయ బోర్లుకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు.

ఇదిలావుండగా జిల్లాలో చాలా కాలం నుంచి వ్యవసాయ రంగానికి కొత్త విద్యుత్ కనెక్షన్లు మంజూరు కాలేదు. విద్యుత్ కార్యాలయాల్లో దరఖాస్తులు భారీగా పేరుకుపోయాయి. విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏడు నెలల క్రితం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో పలు మార్పులు చేర్పులు చేసింది. గతంలో మాదిరిగా ఈపీడీసీఎల్ కాల్‌సెంటర్ లేదా మీసేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే వీలు కల్పించింది. దళారుల ప్రమేయం లేకుండా రైతులు ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ పొందేలా రూపకల్పన చేశారు. కనెక్షన్ ... మిగతా 4వ పేజీలో

నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం

- స్థాయీ సంఘ సమావేశాలు కూడా...

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సవరణ, వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ ఆమోదం కోసం శనివారం ఉదయం 10.30 గంటలకు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జడ్పీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. అంతకు ముందు ఉదయం తొమ్మిది నుంచి 10.30 గంటల వరకు స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. తొలుత స్థాయీ సంఘ సమావేశాల్లో సవరించిన, అంచనా బడ్జెట్‌లు ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదం తీసుకుని తరువాత సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెడతామని పేర్కొన్నారు. సభ్యులు ఈ సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

నేడు కిరండూల్ పాసింజర్‌కు అదనపు విస్టా డోమ్ కోచ్

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-కిరండూల్ మధ్య నడుస్తున్న పాసింజర్ రైళ్లకు అదనంగా ఒక విస్టాడోమ్ చైర్‌కార్ కోచ్‌ను జత చేసినట్టు వాల్తేరు రైల్వే సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. బుధవారం విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501)కు, తిరుగు ప్రయాణంలో (58502) రైలుకు ఈ నెల 19వ తేదీన అదనపు కోచ్ ఉంటుందని పేర్కొన్నారు.

సర్కారీ బడులు వెలవెల!

గత ప్రభుత్వ తీరుతో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం

- పట్టుమని పది మంది విద్యార్థులు కూడా లేని వైనం
- మాకవరపాలెం మండలంలో మూడు స్కూళ్లలో ఇద్దరేసి పిల్లలు
- మరో నాలుగు పాఠశాలల్లో మూడు నుంచి ఏడుగురు
- టీచర్లు సమయపాలన పాటించడంలేదని ఆరోపణలు

మాకవరపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానం పేరుతో గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసింది. ఉన్నత పాఠశాలలకు కిలోమీటరు పరిధిలో వున్న ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులను మాత్రమే వుంచి, మిగిలిన మూడు తరగతులను హైస్కూళ్లలో విలీనం చేసింది. ఫలితంగా పలు ప్రాథమిక పాఠశాలల్లో పట్టుమని పది మంది కాదుకదా.. కనీసం ఐదారుగురు విద్యార్థులు కూడా లేరు. ఈ తరహా పాఠశాలలు మాకవరపాలెం మండలంలో పదికిపైగా వున్నాయి.



సుభద్రయ్యపాలెం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

మాకవరపాలెం మండలం సుభద్రయ్యపాలెం పాఠశాలలో గత మూడేళ్ల నుంచి ఇద్దరు విద్యార్థులు మాత్రమే వున్నారు. వీరు మూడో తరగతిలోకి వచ్చేనాటికి మిగిలిన నాలుగు తరగతుల్లో ఒక్కరు కూడా లేరు. గత రెండేళ్లలో ఒకటో తరగతిలో ఒక్కరు కూడా చేరలేదు. ఇద్దరు విద్యార్థులకు పాఠాలు ... మిగతా 4వ పేజీలో

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

» గత ఐదేళ్లు విస్మరించిన వైసీపీ పాలకులు

» మార్టూరు 'పల్లె పండుగ'లో ఎమ్మెల్యే సుందరపు



మార్టూరు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

అచ్యుతాపురం రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. మండలంలో మార్టూరులో శుక్రవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామ దేవతకు పూజలు చేసిన అనంతరం మాట్లారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. ఇది గుర్తించిన కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, మార్టూరులో వైసీపీకి చెందిన పలువురు గ్రామ నాయకులు జనసేనలో చేరగా, వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసీపీకి ఓటుతో బుద్ధిచెప్పినా ఆ పార్టీ నాయకులకు ఇంతా బుద్ధి రాలేదని ఎమ్మెల్యే సుందరపు ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి రామదాసు, ద్వారపురెడ్డి బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో కనకమహాలక్ష్మి తీర్థం రేపు

» జిల్లా వ్యాప్తంగా భారీగా తరలి రానున్న భక్తజనం » పది రోజులుగా నిర్వాహకులు ఏర్పాట్లు » విద్యుద్దీపాలతో ఎలమంచిలి ధగధగ

ఎలమంచిలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఎలమంచిలి పట్టణంలోని ధర్మవరంలో కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థం ఆదివారం అత్యంత ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు గత పది రోజుల నుంచి భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఏటా మార్గశిర మాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఈ నెలరోజులూ భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకుంటుంటారు. గురువారాల్లో రద్దీ మరింత అధికంగా ఉంటుంది. సంక్రాంతి పండుగ అనంతరం అమ్మవారి తీర్థాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొఠారు సాంబ, కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఈ నెల 19వ తేదీన తీర్థం జరగనున్న ప్రాంతం సమీపంలోని రాజీవ్ గాంధీ క్రీడామైదానానికి వేలాదిగా తరలి రానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా చూస్తున్నారు. ఆ రోజు తెల్లవారుజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే ఆలయ పరిసరాల్లో విద్యుద్దీపాలంకరణ పనులు చేపట్టారు. ప్రధాన రోడ్డు వెంబడి దేవతా మూర్తులు, ఈఫిల్ టవర్ తదితరాల సెట్‌లు వేస్తున్నారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.




కొలువుదీరిన అమ్మ, విద్యుద్దీప కాంతులతో ధగధగలాడుతున్న ధర్మవరంలోని ఆలయం

అమ్మవారిని దర్శించుకున్న జడ్జిలు



అమ్మవారిని దర్శించుకుంటున్న జడ్జిలు విజయ, స్వాతి భవానీ, వీరరాఘవేంద్రరావు తదితరులు

కనకమహాలక్ష్మి అమ్మవారిని శుక్రవారం ఎలమంచిలి జడ్జిలు దర్శించుకున్నారు. ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి పి.విజయ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతి భవానీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి టి.వీరరాఘవేంద్రరావులు ఆలయానికి విచ్చేశారు. వీరిని ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొఠారు సాంబ, కొండబాబు, గణపతి, మడగల సత్యనారాయణ స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్.నాగేశ్వరావు, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

లక్ష్యానికి మించి ధాన్యం సేకరిస్తాం

-పి.ఆదినారాయణ, ఏవో



మండలంలో ఖరీఫ్ పంట ఆశాజనకంగా ఉంది. ఫలితంగా ఈ ఏడాది ధాన్యం సేకరణ లక్ష్యాన్ని మించి జరిగే అవకాశం ఉంది. గత ఏడాది సుమారు 400 మెట్రిక్ టన్నుల వరకు సేకరించాం. ఈ ఏడాది ఖరీఫ్ పంట ఆశాజనకంగా ఉన్నందున లక్ష్యానికి మించి సుమారు 600 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు కృషిచేస్తున్నాం. వంద కిలోల ధాన్యం బస్తాకు రూ.2,300, ఎ-గ్రేడుకు రూ.2,330 ఇస్తున్నాం.

ప్ర: ఈ ఏడాది ఎంత ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?

జ: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గతేడాది సుమారు 400 మెట్రిక్ టన్నుల వరకు సేకరించాం. ఈ ఏడాది ఖరీఫ్ పంట ఆశాజనకంగా ఉన్నందున లక్ష్యానికి మించి సుమారు 600 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేందుకు కృషిచేస్తున్నాం. ఈ నెలాఖరు నుంచి రైతులు ధాన్యం విక్రయించవచ్చు.

ప్ర: ఈ ఏడాది రైతుల నుంచి ఇప్పటి వరకు ఎంత ధాన్యం సేకరించారు?

జ: నామవరం, పీఏసీఎస్‌తో పాటు సత్యవరం గ్రామంలో రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 21 మంది రైతుల నుంచి 60 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. 48 గంటల్లో రైతుల ఖాతాలకు డబ్బులు జమచేయడం జరిగింది.

ప్ర: రైతులకు గిట్టుబాటు ధర అందుతున్నదా?

జ: ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో 2,765 హెక్టార్లలో రైతులు వరి పంట వేశారు. అధిక సంఖ్యలో రైతులు 80 శాతం పంటను ఇంటి అవసరాలకు ఉంచుకుని మిగిలిన ధాన్యాన్ని విక్రయిస్తారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యం వంద కిలోల బస్తాకు రూ.2,300, ఎ-గ్రేడుకు రూ.2,330 ఇస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ధాన్యాన్ని విక్రయించుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: రబీ పంటకు విత్తనాలు సరఫరా చేశారా?

జ: రైతులకు అవసరమైన అపరాల విత్తనాలు 40 శాతం సబ్సిడీపై ఇప్పటికే అందించాం.

-పాయకరావుపేట, ఆంధ్రజ్యోతి

గొరపూడి కొండ వద్ద సంచరించింది పులికాదు.. నక్కే..

» అటవీ అధికారి రమణ వెల్లడి



గొరపూడి కొండ వద్ద సిబ్బందితో పరిశీలిస్తున్న అటవీ అధికారి

రాంబిల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొరపూడి గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ వద్ద పులి సంచారంపై సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల భయాందోళన చెందుతున్న అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రచురించడంతో శుక్రవారం అటవీ శాఖ అధికారులు వెనువెంటనే స్పందించారు. ఇందులో భాగంగా అటవీ రేంజర్ జి.అనీల్‌కుమార్, సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు అటవీ అధికారి రమణ సిబ్బందితో కలిసి గొరపూడి కొండ వద్ద పులి సంచరించిందని ప్రచారం జరిగిన ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతాల్లో పులులు సంచరించే అవకాశం లేదన్నారు. ఇక్కడ సంచరించింది నక్క మాత్రమేనని స్పష్టం చేశారు. సామాజిక మాధ్య మాల్లో ఎవరైనా ఇటువంటి పోస్టులు పెడితే ప్రజలు భయాందోళనకు గురికావద్దని సూచించారు. ప్రమాదకర జంతువులు ఈ ప్రాంతాల్లో కనిపిస్తే 180042 55909 ట్రోల్ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది, పంచాయతీ నాయకుడు లాలం తాతబాబు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగాలమ్మ ఆలయంలో మహిళా రైతుల పూజలు

» వరి పంట ఆశాజనకంగా పండడంతో అన్నం నైవేద్యంగా సమర్పణ



మూలపేటలో గంగాలమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

మునగపాక, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మూలపేట గ్రామంలోని గంగాలమ్మ ఆలయంలో మహిళా రైతులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరి పంట ఆశాజనకంగా ఉండి, దిగుబడి బాగా రావడంతో అమ్మవారికి పసుపు కుంకుమలను సమర్పించి, అన్నం నైవేద్యంగా పెట్టారు. తొలుత ఇళ్ల వద్ద వండిన అన్నాన్ని పాత్రల్లో పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పూజల అనంతరం నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి గంగఅప్పలనాయుడు, గ్రామ పెద్దలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు సహించం

రాంబిల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలం కేంద్రం రాంబిల్లి పంచాయతీ శివారు వాడపాలెం, కొత్తపట్నం సముద్రతీరాల్లో ఇసుక దోపిడీపై ఫారెస్టు సెక్షన్ అధికారి షేక్ సుకూర్ స్పందించారు. 'సముద్ర తీరంలో ఇసుక దోపిడీ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించడంతో ఆయన వెనువెంటనే స్పందించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లోని తీరాలు సమీపంలో ఇసుక తవ్వకాలు జరిపిన ప్రదేశాలను పరిశీలించారు. ఇసుక తవ్వకాలు జరిపిన ప్రదేశాలు తమ పరిధిలో లేవన్నారు. తీర ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపిన వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

కొత్తూరు మామిడివాడలో పైడితల్లమ్మ తీర్థం

రాంబిల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు మామిడివాడలో పైడితల్లమ్మ తీర్థాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకుజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతి రావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జనసేన నాయకుడు సతీష్‌కుమార్ తదితరులు దర్శించుకున్నారు.



మండలంలోని వివిధ గ్రామాల నుంచి తీర్థానికి విచ్చేసిన భక్తజనం

న్యాయంపూడిలో పూరిల్లు, చర్చి దగ్ధం



ప్రమాదంలో కాలిపోయిన పూరిల్లు, చర్చి

నక్కపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపూడి పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లు, ఒక చర్చి దగ్ధమయ్యాయి. చర్చిలో క్రైస్తవ సోదరులు ప్రార్థనలు చేస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. దీంతో లోనున్న వారంతా భయాందోళనతో పరుగు తీశారు. స్థానికులు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించినంతలో సమీపంలోని పూరింటికి వ్యాపించాయి. దీంతో నక్కపల్లి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు బాధితులు చెబుతున్నారు. సంఘటనా స్థలాన్ని సర్పంచ్ ఆర్.వరహాలు, ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు పరిశీలించారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



పోటీల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

ఎస్.రాయవరం, జనవరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసూదిపురంలో శుక్రవారం సర్పంచ్ కరణం మేఘమాల భవాని, టీడీపీ సీనియర్ నేత శివ దంపతుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు. స్థానిక మహిళలు పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేశారు. వీరిలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. అలాగే గ్రామంలో నిర్వహించిన తీర్థంలో స్థానికులు సందడి చేశారు.

ఎంఎస్‌ఎంఈ సర్వేకు స్పందన కరువు

» వ్యాపార వివరాలు చెప్పేందుకు వర్తకుల నిరాకరణ

» సచివాలయ ఉద్యోగులకు డ్రస్ కోడ్ లేక సమస్య

» పాయకరావుపేటలో పది శాతం కూడా పూర్తికాని సర్వే

పట్టణంలోని వ్యాపారులకు సాంకేతిక, నైపుణ్యంపై శిక్షణకు ఔత్సాహికులను గుర్తించేందుకు నిర్వహిస్తున్న ఎంఎస్‌ఎంఈ సర్వేకు స్పందన కరువైంది. సచివాలయ ఉద్యోగులకు తమ వివరాలు ఇచ్చేందుకు వ్యాపారులు నిరాకరిస్తుండడం పెద్ద సమస్యగా మారింది. దీంతో సర్వే నత్తనడకన సాగుతోంది.

పాయకరావుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపార కేంద్రాల నిర్వాహకులకు అవసరమైన సాంకేతిక, వృత్తి నైపుణ్యం తదితర అంశాలపై శిక్షణకు ఎంఎస్‌ఎంఈపై సచివాలయ ఉద్యోగుల ద్వారా చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాయకరావుపేటలో కేటగిరి-2 విద్యుత్ వినియోగిస్తున్న సుమారు 2 వేల చిన్న, మధ్యతరహా వ్యాపార, సేవా కేంద్రాల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. వ్యాపార కేంద్రం లైసెన్స్, సేల్స్ ట్యాక్స్, జీఎస్టీ లైసెన్సు, వార్షిక టర్నోవర్, లేబరు లైసెన్సు తదితర 10 అంశాలకు సంబంధించి వివరాలు నమోదుచేయాల్సి ఉంది. అయితే, ఈ వివరాలు ఇచ్చేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. ముఖ్యంగా సర్వేకు వచ్చినవారికి ఐడీ కార్డు ఉన్నా డ్రస్ కోడ్‌లేక సచివాలయ ఉద్యోగులా కాదా అన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెలాఖరునాటికి సర్వే పూర్తికావాల్సి ఉండగా పట్టణంలో ఇప్పటి వరకు పది శాతం కూడా పూర్తికాకపోవడం ఇందుకు నిదర్శనం.



వ్యాపార కేంద్రాల్లో సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

దీనిపై పాకరావుపేట ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి వర్మను వివరణ కోరగా... చిన్న వ్యాపారాలు, చిన్న పరిశ్రమల అభివృద్ధి కోసం చేపడుతున్న ఈ ఎంఎస్‌ఎంఈపై సర్వేకు వ్యాపారులు సహకరించకనే నత్తనడకన సాగుతోందన్నారు. ముఖ్యంగా సచివాలయ ఉద్యోగులకు డ్రస్‌కోడ్ లేక వచ్చినవారు సచివాలయ ఉద్యోగులని వారు నమ్మడం లేదన్నారు. తమ వ్యాపార వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నట్టు ఆయన చెప్పారు.

నవోదయ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నక్కపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యాలయంలో శనివారం జరగనున్న నవోదయ ప్రవేశ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ నాగన్నదొర తెలిపారు. స్థానిక గురుకులం పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి సదుపాయాలను పరిశీలించారు. శనివారం ఉదయం 11-30 గంటల నుంచి 1-30 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ఇన్విజిలేటర్లు ఉదయం 10 గంటలకే హాజరుకావాలన్నారు. పరీక్ష కేంద్రంలో ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతుల్లేవన్నారు. తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు కల్పించామన్నారు. పరీక్ష కేం ద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు సుమారు 240 మంది చిన్నారులు నక్కపల్లి కేంద్రంలో పరీక్ష రాయనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఈంవోలు కె.నరేశ్, వేమగిరి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి పశు వైద్య శిబిరాలు

నర్సీపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ, నర్సీపట్నం మండలాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఏరియా పశువుల ఆస్పత్రి సహాయ సంచాలకులు డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు. ఈ వైద్య శిబిరాలలో పశువులకు, దూడ పెయ్యలకు, మేకలు గొర్రెలకు నట్ట నివారణా మందులు వేస్తామని ఆయన చెప్పారు.

వ్యాధులతో ఉన్న పశువులకు ఉచిత వైద్యం, మందులు అందిస్తామన్నారు. గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు ఉచిత శస్త్ర చికిత్సలు అందిస్తామని ఆయన చెప్పారు. మండలంలోని రెండు ఎంపిక చేసిన గ్రామాలలో ప్రతీ రోజు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పశు వైద్యాధికారి, పశు వైద్య సహాయకులు, రైతు సేవా కేంద్రంలోని పశు వైద్య సహాయకులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



పెదరాంభద్రపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అపరాల పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఏవో పి.ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం పెదరాంభద్రపురం, గుంటపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు అపరాల సాగులో పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేపట్టి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంట దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధరకు పంటను విక్రయించుకోవాలని సూచించారు. ముందుగా అపరాల పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సస్య రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తాండవ ఎఫ్‌పీఓ జీవీవీ సత్యనారాయణ, ఏఈఓ జోత్స్న, వీఏఏ వందన పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

రావికమతం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పి.పొన్నవోలు పంచాయతీ శివారు జి.చీడిపల్లి గ్రామ శివారులో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న శ్రీనివాసరావు

కోటవురట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి శివారు రాట్నాలపాలెంలో తీర్థ మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు శుక్రవారం టీడీపీ మండల అధ్యక్షుడు జానకీ శ్రీనివాసరావు, నాయకులు జానకీహరిబాబు బహుమతులను ప్రదానం చేశారు. బాబు జగ్జీవన్‌రాయ్ యూత్, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో రామమందిరం వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో 22 మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గంటేడ చిరంజీవి, కాకర కుమార్, గంటేడ అప్పలరాజు, పలవెల్లికోటి, గంటేడ లోవరాజు, మాజీ సర్పంచ్ గంటేడ అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు వంగలపూడి రాంబాబు, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కోటవురట్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యావికాశ్ పబ్లిక్ స్కూల్‌లో 2009-2018 విద్యా సంవత్సరాల్లో ఎల్‌కేజీ నుంచి ఏడో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు శుక్రవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఏడేళ్ల తర్వాత కలుసుకున్న వీరంతా తమ క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు, అనంతరం తమ గురువు పాపా సాహెబ్ దంపతులను సన్మానించారు.

గ్రామాలను వణికిస్తున్న చలిపులి

మాడుగుల రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలను చలి పులి వణికిస్తున్నది. శుక్రవారం నుంచి వేకువజామున, సాయంత్రం సమయాల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు చలిని తట్టుకోలేకపోతున్నారు. దీంతో రగ్గులు, స్వెట్టర్లు ధరిస్తున్నారు. ప్రయాణాలు చేసే వరకు నరకం చూస్తున్నారు.

20 నుంచి గుల్లేపల్లిలో భూముల రీ సర్వే

» పైలట్ ప్రాజెక్టుగా నిర్వహణ » ఏడు బృందాలు ఏర్పాటు

» 120 రోజుల్లో 1681 ఎకరాలు సర్వే : తహసీల్దార్ చిన్నికృష్ణ



సర్వే వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ఈనెల 20 నుంచి పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోని గుల్లే పల్లిలో ప్రారంభిస్తున్నట్టు తహసీల్దార్ బి. చిన్నికృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సదరు గ్రామంలో 1681 ఎకరాల భూములు ఉన్నాయని, వీటి సర్వేకు ఏడు బృందాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇందులో ఆరు బృందాలు సర్వే నిర్వహణకు, మరో బృందం రైతులకు అవసరమైన సమాచారం ఇచ్చేందుకు పరిచేస్తుందని చెప్పారు. ఒక్కో బృందంలో ఇద్దరు విలేజ్ సర్వేయర్లు, ఒక వీఆర్వో ఒక వీఆర్ఏ ఉంటారన్నారు. ఒక్కో బృందానికి సర్వే నిమిత్తం 250 నుంచి 300 ఎకరాలు కేటాయించడం జరుగుతుందన్నారు. గ్రామంలో 120 రోజుల వ్యవధిలో సర్వే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. సర్వే సమాచారం అంతా ముందుగానే రైతులకు అంద జేస్తామన్నారు. రైతులు సర్వేకు వచ్చే అధికారులకు హద్దులు చూపించి, వారి వద్ద ఉన్న భూ హక్కు పత్రాలతో పాటు ఆధార్ జెరాక్స్ కాపీలు, రెండు ఫొటోలు, ఫొన్ నెంబరు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎం.గణపతిరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు పాల్గొన్నారు.

క్వారీ, క్రషర్ల ఇష్టారాజ్యంతో గ్రామాల్లో కాలుష్యం

» అనకాపల్లి మండల సమావేశంలో సభ్యులు ధ్వజం » మైన్స్ అధికారులపై అసంతృప్తి » సమస్యలను వివరించిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు



సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తున్న మైన్స్ విభాగం అధికారి

తుమ్మపాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలో ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న అనధికార క్వారీ, క్రషర్లపై కఠిన చర్యలు చేపట్టాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన అనకాపల్లి మండల సర్వసభ్య సమావేశంలో మైన్స్ అధికారులను పలువురు ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఈ సందర్భంగా బవులవాడ ఎంపీటీసీ తోటాడ విజయ్ మాట్లాడుతూ క్వారీ, క్రషర్లను ఆయా యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా నిర్వహిస్తుండడం వల్ల గ్రామాలు కాలుష్యం బారిన పడుతుండడంతో పాటు రోడ్లు ఛిద్రమవుతున్నాయని వాపోయారు. ఉమ్మడి విశాఖజిల్లాల కలెక్టర్ల అకౌంట్లలో ఉన్న డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్‌ను మండల అభివృద్ధి కోసం వినియోగించాలని కోరారు. ఉమ్మడి కలెక్టర్ల ఖాతాలో దాదాపు రూ.25 కోట్లు మినరల్ ఫండ్ ఉన్నట్టు చెప్పారు. గొలగాం ఎంపీటీసీ నారపిన్ని చంద్రశేఖర్ మాట్లాడుతూ అనుమతులు లేని క్వారీల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనుమతులున్న క్వారీలలో సైతం పరిమితికి మించి తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. అయినప్పటికీ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే తుమ్మపాల ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు మాట్లాడుతూ ఇటీవల తుపాన్ల కారణంగా రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, దీనిపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఎంపీటీసీ ప్రశ్నకు మండల వ్యవసాయాధికారి ఈ.రంగాచారి సమాధానమిస్తూ వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. దీనికి సంబంధించి వెంకుపాలెంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. రైతులు తీసుకున్న రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీని అందిస్తున్నట్లు వివరించారు. కౌలు రైతులకు సైతం రుణాలు అందించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ యంత్ర పరికరాలను సైతం సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అలాగే పలు శాఖల అధికారులపై ప్రజా ప్రతినిధులు ప్రశ్నల వర్షాన్ని కురిపించారు.

ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ మండలంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా క్వారీ, క్రషర్ల సమస్యలను జిల్లా పరిషత్ సమావేశంలో చర్చించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహారావు, ఈవోపీఆర్డీ ప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాల్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'తాడి గ్రామం తరలించి కాలుష్య ముప్పు తప్పించండి'



గ్రామస్థులతో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

పరవాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఫార్మా కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామం తరలింపునకు ప్రభుత్వం సత్వరమే చర్యలు చేపట్టాలని జనవిజ్ఞాన వేదిక నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి, మారిశెట్టి వెంకట అప్పారావు డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో చేపడుతున్న పర్యావరణ అవగాహన యాత్రలో భాగంగా శుక్రవారం వీరు తాడి, చినతాడి, తాడి బీసీ కాలనీలలో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాయు, జల కాలుష్యం అధికంగా ఉందని, ఈ కారణంగా తరచూ అనారోగ్యం బారిన పడుతున్నామని గ్రామస్థులు వాపోయారు. చర్మ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు అధికంగా ఉన్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తాడిగ్రామ తరలింపునకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు బి.రామ్‌కుమార్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

20 నుంచి గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు : ఏడీ

అనకాపల్లి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి, కశింకోట మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్టు అనకాపల్లి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకురాలు డాక్టర్ బి.సౌజన్య తెలిపారు. ఈ శిబిరాల్లో పశువులకు, దూడలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేస్తామన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్లకు టీకాల కార్యక్రమం ఉంటుందని చెప్పారు. రోజుకు రెండు గ్రామాల్లో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇందు కోసం పశువైద్యాధికారి, పశు వైద్య సహాయకులు, రైతు సేవా కేంద్రాల్లోని పశువైద్య సహాయకులతో రెండు బృందాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.


'కమ్యూనిస్టు నేత జ్యోతిబసు సేవలు చిరస్మరణీయం'



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం శ్రేణులు

అనకాపల్లి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు పార్టీ ఉద్యమనేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు వర్ధంతిని శుక్రవారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శంకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జ్యోతిబసు బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా వరుసగా ఐదుసార్లు పనిచేశారని పేర్కొన్నారు. పార్టీ నాయకుడు గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అడిగర్ల రాజు, కె.ఈశ్వరరావు, పి.శ్రీనివాసరావు, కె.తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేత



రోగుల కుటుంబాలకు చెక్కులు అదజేస్తున్న జనసేన నాయకుడు రాంకీ

కొత్తూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వైద్య సేవల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఇక్కడి జనసేన కార్యాలయంలో శుక్రవారం ఆయా కుటుంబాలకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో ఈ నిధులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సిఫార్స్ మేరకు ప్రభుత్వం విడుదల చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా గుర్రపు పరుగు పందేలు



పోటీలను తిలకించేందుకు భారీగా తరలి వచ్చిన జనం

కొత్తూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కూండ్రంలో ఉత్సాహభరిత వాతావరణంలో జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందేలు జరిగాయి. పెదరామ కోవెల తీర్థాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో మొత్తం 12 గుర్రాలు తలపడ్డాయి. మొదటి ఐదు స్థానాల్లో నిలిచినవాటిని ఎంపిక చేశారు. ప్రథమ బహుమతి కొత్యాడ తలయారి గ్రామానికి చెందిన సాయి వివేక్, ద్వితీయ బహుమతిని చేనుల అగ్రహారం గ్రామానికి చెందిన మణికంఠ, తృతీయ బహుమతిని రామన్నపాలెం గ్రామానికి చెందిన చోడమాంబిక, నాల్గవ బహుమతిని అంకుపాలెం గ్రామానికి చెందిన మోదమాంబ, ఐదో బహుమతిని ధర్మిరెడ్డి అప్పారావు గుర్రాలు దక్కించుకున్నాయి. దీంతో నిర్వాహకులు ఆయా యజమానులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ పోటీలను తిలకించేందుకు భారీగా తరలి వచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

» జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో సీఐ మల్లికార్జునరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు కోరారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాంకీ కమర్షియల్ హబ్‌లో ఫార్మా పరిశ్రమల ఉద్యోగులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వాహనాలను అతివేగంగా నడపడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపరాదని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్లు ధరించాలని, ఫోర్ వీలర్లలో ప్రయాణించేవారు సీటు బెల్టులు విధిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాంకీ డీజీఎం గిరిధరరావు భక్షి, రాంకీ ప్రతినిధులు రాఘవరెడ్డి, మోహన్‌రావు, త్రినాథరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు

» అరికట్టే చర్యలు చేపట్టాలి : సీపీఐ నాయకులు విజ్ఞప్తి



మాట్లాడుతున్న సంఘం నాయకుడు కర్రి అప్పారావు

తుమ్మపాల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం నుంచి అనకాపల్లి చేరు కునే జాతీయ రహదారి లంకెలపాలెం వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశంలో రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, సీపీఐ నాయకుడు రాజాన దొరబాబు మాట్లాడారు. లంకెలపాలెం జంక్షన్ వద్ద రోడ్డు దిగువకు ఉండడంతో అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల అనకాపల్లికి చెందిన ప్రముఖ న్యాయవాది చిన్నయ్యశెట్టి కూడా పలు కారణాలతో రోడ్డు ప్రమాదం బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ, ఆర్టీవో అధికారులతో పాటు పలు శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సురేష్‌బాబు, కోరుబిల్లి శంకర్రావు, కర్రి అప్పారావు, శేఖర్‌మంత్రుల సాయి వెంకట లక్ష్మణ్, కొణతాల హరినాథబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా తీర్థ మహోత్సవాలు



వెంకుపాలెంలో సీతారాముల తీర్థానికి తరలివచ్చిన భక్తులు



పరవాడ మండలం తానాం గ్రామంలో..

కొత్తూరు/కశింకోట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని వెంకుపాలెం, కూండ్రం గ్రామాల్లో సీతారాముల తీర్థాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే, కశింకోట మండలంలోని పాతకన్నూరుపాలెం, మోసయ్యపేట గ్రామాల్లో శ్రీరాములవారి తీర్థాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో ఆయా గ్రామాల్లో కోలాహల వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు జరిపారు.

పరవాడ: మండలంలోని తానాం, కలపాక, రావాడ గ్రామాల్లో శుక్రవారం సీతారాముల తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైలా జగన్నాథరావు, సర్పంచ్‌లు కన్నూరు దేవి, బొండా కనకారావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణలతో పాటు స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకున్నారు. సాయంత్రం తీర్థంలో ఏర్పాటు చేసిన కోలాటం, సాముగరిడి, చిడతలు, చిటికెల భజనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సబ్బవరం : రావలమ్మపాలెంలో డొంకమ్మ పేరంటాలు, అసకపల్లిలో సీతారాముల తీర్థాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ఆయా ఆలయాల్లో విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద, సర్పంచ్‌లు సబ్బవరపు నారాయణమూర్తి, కర్రి నర్సింగరావు, మాజీ ఎంపీపీ ఎస్.ముత్యాలనాయుడు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, కర్రి శ్రీను, కరణం రామునాయుడు, సబ్బవరపు దేముడు, దొర, మేడపురెడ్డి జగన్నాథం, జి.ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందిన డాక్టర్ నారాయణరావు



అనకాపల్లి టౌన్, జనవరి 17 (ఆంధ్ర జ్యోతి) : టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు గురువారం రాత్రి విశాఖలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వం పొందారు. లక్ష రూపాయలు చెల్లించి పార్టీ సభ్యత్వం పొందినట్లు ఇక్కడి విలేకరులకు తెలిపారు. కోటి మంది సభ్యత్వం కలిగి ఉన్న టీడీపీలో శాశ్వత సభ్యత్వం తీసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు.

పరవాడ డీఎస్పీగా విష్ణుస్వరూప్

అనకాపల్లి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీగా వల్లెం విష్ణుస్వరూప్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రొబేషనరీ డీఎస్పీలకు ఇచ్చిన పోస్టింగ్‌లో స్వరూప్‌కు పరవాడలో పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత పరవాడ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కె. సత్యనారాయణ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలావుండగా కొత్త డీఎస్పీ బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

కోడి పందేలు ఆడుతున్న నలుగురి అరెస్టు

కొత్తూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వెంకుపాలెం, గోపాలపురం గ్రామాల్లో కోడి పందేలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం సిబ్బందితో వెళ్లి దాడిచేశామన్నారు. ఈ సందర్భంగా రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్టు చెప్పారు.

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్

అనకాపల్లి టౌన్, జనవరి 17 (ఆంధ్ర జ్యోతి) : ఇక్కడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం ఎంపీహెచ్‌ఈవో, సీహెచ్‌వో ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర డైరీని డీఎంహెచ్‌వో పి.రవికుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చుక్కల సత్యనారాయణ, ఐ.సురేష్‌కుమార్, కేవీ రాజశేఖర్, పి.శంకరరావు, భోగిరామ్ పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కానిచ్చేది లేదు : ఎమ్మెల్యే

చోడవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఎప్పటికీ సహకారం రంగంలోనే నడుస్తుందని, దీన్ని ప్రైవేటుపరం కానిచ్చేది లేదని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్పష్టం చేశారు. వేతన బకాయిలు ఇతర సమస్యలపై గోవాడ ఫ్యాక్టరీలో కార్మికులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో, శుక్రవారం గోవాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కార్మికుల వేతనాలు, రైతుల బకాయిల చెల్లింపుల్లో సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని కార్మికులు సహకరించాలని కోరారు. గోవాడ ఫ్యాక్టరీని కాపాడే బాధ్యత తనదని, ఈ విషయంలో కార్మికులు, రైతులు ఆందోళన చెందనవసరం లేదని ఆయన భరోసా ఇచ్చార. గోవాడను ప్రైవేటుకి అమ్మేస్తారంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, అటువంటి ప్రచారాలను ఎట్టిపరిస్థితుల్లో నమ్మవద్దని కోరారు. గోవాడను ఆర్థికంగా గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, ఫ్యాక్టరీకి తిరిగి పూర్వ వైభవం తీసుకుని వచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. ఫ్యాక్టరీ స్థితిగతులపై అవగాహన ఉందని, కార్మికులు కూడా సహకారం అందించి ఫ్యాక్టరీ గాడిపడేందుకు చేయూత అందించాలని కోరారు. సమావేశంలో ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు కేవీవీఎస్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పుతో జనం అవస్థలు

» గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ సమీపంలో భరించలేని దుర్వాసన



ఎలమంచిలి- గాజువాక ప్రధాన రహదారి పక్కన చెత్తకుప్పకు నిప్పు పెట్టిన దృశ్యం

పరవాడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గొర్లెవానిపాలెం పంచాయతీ పరిధి జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీకి ఆనుకొని ఉన్న ఎలమంచిలి- గాజువాక ప్రధాన రహదారి పక్కనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య కార్మికులు వాటిని అక్కడి నుంచి తొలగించాల్సి ఉన్నప్పటికీ నిప్పు పెడుతూ పర్యావరణానికి ముప్పు వాటిల్లేలా చేస్తున్నారు.

ఈ కారణంగా అటుగా రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్తకు నిప్పు పెడుతుండడం వల్ల భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. ఇందులో ఎక్కువ శాతం పాలిథిన్ సంచులు ఉండడంతో ఆ వాసనకు పలువురు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన పంచాయతీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి, మున్ముందు ఇటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.

శారదానగర్ ప్రధాన రోడ్డులో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కొత్తూరు, జనవరి 17 (ఆంధ్ర జ్యోతి) : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీ కొత్తూరు శారదానగర్ ప్రధాన రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులు ఎట్టకేలకు తొలగించారు. 'శారదానగర్‌లో ఎటు చూసినా చెత్తే' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సదరు అధికారులు వెనువెంటనే స్పందించారు. దీంతో గత నాలుగు రోజులుగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మధ్యాహ్నంలోగా తొలగించారు. సంక్రాంతి కావడంతో చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లేది. దీంతో పండకు వచ్చిన బంధుగణం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనేవారు. ఇది గుర్తించి సమస్యను వెలుగులోకి తేవడంతో సమస్యకు పరిష్కారమార్గం లభించింది.

ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు


అవగాహన కల్పిస్తున్న డీఈఈ సన్నిరాంబాబు

చింతపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులను వినియోగదారులు ఈస్ట్రన్ పవర్ మొబైల్ యాప్ ద్వారా చెల్లించాలని ఈపీడీసీఎల్ సబ్ డివిజన్ డీఈఈ కోట్లా సన్నిరాంబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మొబైల్ యాప్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గతంలో వినియోగదారులు బిల్లు కలెక్టర్ల వద్దకు వచ్చి నగదు చెల్లించేవారన్నారు. చింతపల్లి ఉప కేంద్రంలో వారానికి ఒక రోజు బిల్లు కలెక్టర్ అందుబాటులో ఉండేవారన్నారు. ప్రస్తుతం డిజిటల్ లావాదేవీలు పెరగడంతో ప్రజలంతా ఫోన్ పే, గూగుల్‌పే, పేటీఎం వినియోగిస్తున్నారన్నారు. ఈక్రమంలో ఈపీడీసీఎల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ వనుము ప్రభాకరరావు, ఈపీడీసీఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు చింతపల్లిలో ఎన్టీఆర్ వర్ధంతి

చింతపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడుఎన్టీ రామారావు వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు తెలిపారు. ముందుగా స్థానిక పాత బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించనున్నామన్నారు. అలాగే, ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తామన్నారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై సమావేశముంటుందన్నారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొవాలన్నారు.

'22న ఉద్యోగాలకు ఎంపికైన యువత హాజరుకావాలి'

చింతపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జాబ్ మేళాల్లో వివిధ ఉద్యోగాలకు ఎంపికైన గిరిజన యువత ఈనెల 22న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాజరుకావాలని స్థానిక ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి తెలిపారు. ఈనెల 6తేదీన కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాలో 260మంది ప్రైవేటు కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఈ యువతీ, యువకులు కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు. అలాగే ఇంటర్న్‌షిప్‌కి ఎంపికైన తృతీయ సంవత్సరం విద్యార్థులు సైతం హాజరుకావాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు సైతం రిపోర్టు చేయాలన్నారు.

దొరగూడలో మౌలిక వసతుల కల్పనకు కృషి


మాట్లాడుతున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):మండల పరిధి మారుమూల లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని సర్పంచ్ కె.త్రినాద్ అన్నారు. శుక్రవారం ఆయన ఆ గ్రామానికి సందర్శించి గ్రామస్థులతో సమావేశమయ్యారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, రహదారి, కమ్యూనిటీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్ర భుత్వం స్పందించి దొరగూడలో పీఎం జన్‌మన్ ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించాలని, పాఠశాలకు పక్కా భవనం నిర్మాణం చేపట్టాలని, అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలని, ఉపాధి పనులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యం, గ్రామస్థులు పాల్గొన్నారు.ల

నేటి నుంచి లోకుల గాంధీ స్మారక వాలీబాల్ టోర్నీ

కొయ్యూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) కొండ గోకిరి కేంద్రంగా శనివారం నుంచి డివిజన్ స్థాయి లోకుల గాంధీ స్మారక వాలీబాల్ టోర్నీని రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్టు ది తోడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి మఠం మురళీకృష్ణ తెలిపారు. ఏటా దివంగత నేత గాంధీ జ్ఞాపకార్థం కొండ గోకిరి యువ సైన్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో పాల్గొని విజేతలైన క్రీడాకారులకు ప్రథమ బహుమతిగా రూ. 12,500 బహుమతితో పాటు టోర్నీ కప్, ద్వితీయ బహుమతిగా రూ 6,500తోపాటు టోర్నీ కప్ అందిస్తామని నిర్వాహకుడు మురళీకృష్ణ కోరారు. వివరాలకు ఫోన్: 91213 74392, 94914 32841 సంప్రదించాలని సూచించారు.

చింతపల్లిలో పారిశుధ్యం పనులు


మెయిన్ రోడ్డులో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

చింతపల్లి, జ నవరి 17 (ఆం ధ్రజ్యోతి): మం డల కేంద్రంలో పారిశుధ్యం మె రుగుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం గ్రామంలోని పలు వీధుల్లో డ్రైనేజీలను పారిశుధ్య సిబ్బంది శుభ్ర పరిచారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలైన తాజంగి, లంబసింగి పం చాయతీలతో పాటూ చింతపల్లిలో ఐరన్ చెత్త బుట్టలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి వీధిలోని డ్రైనేజీల్లో పూడికను తొలగిస్తున్నామన్నారు. చింతపల్లిలో సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.


కొయ్యూరు ప్రధాన రహదారిపై కోతుల గుంపు


తోటలూరులో విహరిస్తున్న వానరాలు

వానర మూకల వీర విహారం

» గ్రామాల్లో తిష్ఠ ..గుంపులుగా సంచారం » ఇళ్లలో వస్తువుల చిందరవందర » జనాలపై దాడులు » నిరోధ చర్యలు శూన్యం

కొయ్యూరు జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతాల్లో స్వేచ్ఛగా తిరగాల్సిన వానర మూకలు మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు చేరి వీర విహారం చేస్తున్నాయి. దీంతో ఈ కోతుల నుంచి రక్షణ పొందే దిశగా జనాలు దారులు వెతకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో మూడొంతులకు పైగా గ్రామాల్లో గత 15 ఏళ్లలో వానర మూకలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. గత రెండేళ్లలో వీటి సంతతి మరింత పెరిగింది. ఇళ్లపైకి చేరి పెంకులు పీకటం, ఇళ్ల ప్రధాన గేట్లపై వాటి సంతతితో తిష్ఠవేసి లోనికి వచ్చిన వారిపై దాడికి ఉపక్రమిస్తున్నాయి. అలాగే రోడ్లపై ఏదైనా పట్టుకెళ్లే వారిపై దాడులకు పాల్పడుతూ బీభత్సం సృష్టిస్తున్నాయి. ఏ మాత్రం సందు దొరికినా ఇళ్లలోకి చొరబడి సామగ్రిని చిందర వందర చేస్తున్నాయి. అటకాయించిన వారిపై దాడులకు దిగుతున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లలు భయోత్పాతానికి గురయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. వీటిని నియంత్రించేందుకు అటవీ శాఖ బోన్లు సరఫరా చేసినా వాటి జోలికి ఒక్క కోతి కూడా రాకుండా తెలివిగా తప్పించు కుంటున్నాయి. కోళ్లపై దాడి చేసి చంపేస్తున్నాయి. కుక్కలపై సైతం దాడులకు ఎగపడుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ, అటవీ శాఖలు సంయుక్తంగా కోతుల నియంత్రణ చర్యలు తీసుకోవాలని లేకుంటే గ్రామాల్లో కనీసం తిరిగే పరిస్థితులు లేకుండా పోతాయని పలువురు ఆందోళన చెందుతున్నారు.


ఇంటి సన్‌షేడ్‌పైన...

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు 40 రోజుల్లో పరిష్కారం

» జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ

» 'మీ కోసం' కార్యక్రమంలో 37 వినతుల స్వీకరణ

పాడేరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను 40 రోజుల్లో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం మీ కోసం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 37 వినతులు అందాయి. జేసీ, డీఆర్‌వో కె.పద్మలత వివి ధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. సంబంధిత శాఖల అధికారులకు అందజేసి సమస్యలను పరి ష్కరించాలని జేసీ ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన వినతులను తాహసీల్దార్లు 40 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ విధంగా జిల్లాలో 80,401 అర్జీలకు పరిష్కారం చూపాల్సి ఉందని నిర్దేశించారు. అటవీ హక్కు పత్రాల జారీకి సంబంధించిన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని, మీకోసం వెబ్‌సైట్‌లో నమోదైన సమస్యలను తగిన విధంగా పరిష్కరించాలని జేసీ పేర్కొన్నారు.

మీ కోసంలో వచ్చిన ప్రధాన సమస్యలు

హుకుంపేట మండలం బూర్జవలసలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చే యాలని బూర్జ ఎంపీటీసీ సభ్యుడు మజ్జి హరి కోరారు. పాడేరు మండలం చింతలవీధి పంచాయతీ నడింవీధికి చెందిన కె.వరాలమ్మ ఇల్లు మంజూరు చేయాలని, అనంతగిరి మండలం ఎగువ శోభ పంచాయతీ బీసుపురంలో అక్రమంగా రిసార్టులు ని ర్మిస్తున్నారని, వీటిని అడ్డుకోవాలని పి.రవీంద్ర ఫిర్యాదు చేశారు. పాడేరు మండలం డోకులూరు పంచాయతీ తోటలగొందిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పి.రాంబాబు, ఎం.కృష్ణారావు కోరారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సీ జమాల్ బాషా, జిల్లా ఉద్యానవనాధికారి ఎ.రమేశ్‌కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్. నంద్, డీఈవో పి. బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఎల్. రజని, తదితరులు పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ, డీఆర్‌వో పద్మలత

మోదకొండమ్మ వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు తదితరులు

పాడేరురూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి వార్షిక క్యాలెండర్‌ను ఆలయ కమిటీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పేరు గాంచిన అమ్మవారి క్యాలెండర్లను భక్తులకు పంపిణీ చేయనున్నామన్నారు. అలాగే, ఈ నెల 19వ తేదీన జరగనున్న అమ్మవారి తీర్థమహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆరోజు సాయంత్రం 5 గంటలకు జరగనున్న అమ్మవారి ఊరేగింపులో భక్తులు పాల్గొవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలున్నారు.

ఉపాధి పని దినాలు పెంచాలి: సీఐటీయూ


ఉపాధి కూలీలతో సీఐటీయూ నేత శంకరరావు

ముంచంగిపుట్టు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పని దినాలు పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరరావు అన్నారు. మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో ఉపాధి పనులను చేస్తున్న కూలీలతో శుక్రవారం ఆ యన మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 250 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. కూలీలకు పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతీ కూలీకి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు చండల్, సంతన్న, డుంబ్రు పాల్గొన్నారు.

పెద్ద పులి ఆచూకీ కోసం ట్రాప్ కెమెరాల ఏర్పాటు


రేయిన్ గేజ్ ప్రాంతంలో కెమెరాలను అమర్చుతున్న అటవీ సిబ్బంది

సీలేరు, జనవరి 17 , (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సప్పర్ల రేయిన్ గేజ్ అటవీప్రాంతంలో పులి ఆచూకీ కోసం అటవీశాఖ సిబ్బంది శుక్రవారం ట్రాప్ కెమెరాలను అమర్చారు. గత ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో డొంకరాయి నుంచి పాడేరు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు రేయిన్ గేజ్ సమీపంలో ప్రధాన రహదారిపై పెద్ద పులి సంచరించడంతో బస్సు డ్రైవర్, ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ఈ నేపథ్యంలో రెయిన్ గేజ్ పరిసర ప్రాంతాల్లోనే పులి సంచరిస్తోందా? లేక ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లిందా ? అన్న అంశంను నిర్ధారణకు సీలేరు అటవీశాఖ రేంజ్ అధికారి ఎస్.ఎంకటరావు ఆధ్వర్యంలో ఆ పరిసర ప్రాంతాల్లో 10 చోట్ల ట్రాప్ కెమెరాలను చెట్లకు అమర్చారు. పులి ఆచూకీని ఈ ట్రాప్ కెమెరాల ద్వారా గుర్తించడానికి వీలుందని సీలేరు రేంజ్ అధికారి ఎస్. వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధారకొండ సెక్షన్ అధికారి సతీశ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాడేరులో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్'

పాడేరురూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పాడేరులో 18వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ కూడలిలో నిర్వహించనున్న స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు కోరారు. ఈ కార్య క్రమంలో భాగంగా నెలలో ప్రతీ 3వ శనివారం స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్‌లు పాల్గొవాలని కోరారు.

పాత్రికేయుడికి ఆర్థిక సాయం

అనంతగిరి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన మండల పరిధి రాజుపాక గ్రామానికి చెందిన ఓ దిన పత్రిక విలేకరి జన్ని రామన్నకు మాతృభూమి సేవా సంస్థ ప్రతినిధులు నగేశ్, విప్పలవలస గోపాలరావు, అభిషేక్, జయమ్మ శుక్రవారం రూ. 10 వేలు అందించారు. వారం రోజుల క్రితం ప్రమాదవశాత్తు రామన్నకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మాతృభూమి సంస్థ ప్రతినిధులు గ్రామానికి వెళ్లి రామన్నను పరామర్శించి, వైద్యసేవలు నిమిత్తం ఆర్థిక సాయం అందించారు.. ఈ కార్యక్రమంలోని టీడీపీనాయకుడు మోస్య రంజీత్ పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి


బంధువులకు పచ్చిబత్తెం తీసుకు వస్తున్న గిరిజనులు


సహపంక్తి భోజనాలు చేస్తున్న ఆదివాసీ కుటుంబాలు

గూడెంకొత్తవీధి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగ్రహారంలో సంక్రాంతి పెద్దపండగను ఆదివాసీలు గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించారు. సాధారణంగా ఆదివాసీలు సంక్రాంతి పండగ ముగిసిన తరువాత బంధుమిత్రులతో పెద్దపండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం గ్రామంలో ఈ వేడుక నిర్వహించారు. ఈ పండగలో పాల్గొనేందుకు ఆదివాసీలు సంప్రదాయంగా థింసా నృత్య వాయిద్యాలతో బంధువుల గృహాలకు వచ్చారు. వట్టి చేతులతో కాకుండా వారి వెంట పచ్చిబత్తెం (ఆహారధాన్యాలు, నాటుకోళ్లు, మేకలు, వివిధ కూరగాయలు) తీసుకువచ్చారు. అనంతరం అంతా ఒకే చోట ఆహారాన్ని సిద్ధం చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. చిన్నా, పెద్ద తేడాలేకుండా థింసా నృత్యం చేశారు.

బంధువులను అప్యాయంగా పలకరించుకుంటూ ప్రేమాభిమానాలను చాటారు. సాయంత్రం వరకు గ్రామంలో ఆదివాసీలు కుటుంబాలతో సందడిగా గడిపారు.

ప్రజల సహకారంతో గ్రామాల్లో శాంతియుత వాతావరణం

» సీఆర్‌పీఎఫ్ జీ 42 బెటాలియన్ డీఎస్పీ సందీప్‌రెడ్డి


మాట్లాడుతున్న డీఎస్పీ సందీప్‌రెడ్డి

సీలేరు, జనవరి 17 , (ఆంధ్రజ్యోతి) : సీఆర్‌పీఎఫ్ నిర్వహించనున్న సివిక్ యాక్షన్ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, ప్రజ లు భాగస్వాములు కావాలని సీఆర్‌పీఎఫ్ జీ 42 బెటాలియన్ డీఎస్పీ ఎ. సందీప్‌రెడ్డి కోరారు. జీకేవీధి మండలం సీలేరు పోలీస్‌స్టేషన్ భద్రతను చూసే ఈ బెటాలియన్ డీ ఎస్పీగా ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం సీలేరు పోలీస్టేషన్‌లోని సీఆర్‌పీఎఫ్ కార్యాలయంలో స్థానిక గ్రామ పెద్దలతో తొలిసారి సమావేశమై మాట్లాడారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎటువంటి హాని జరగకుండా ప్రభుత్వం సీఆర్‌పీఎఫ్ బలగాలను నియమించిందన్నారు. ప్రజలు సహకరిస్తే గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొలకొనడానికి వీలవుతుందన్నారు. ఈ నెలాఖరుకు సివిక్ యాక్షన్ ప్రోగ్రాం కార్యక్రమం కింద మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి వారికి ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి దు ర్గో, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా సాంబమూర్తి, వైస్ సర్పంచి కె. వల్లీప్రసాద్, కూటమి నాయకుడు సీహెచ్ రాము, మాజీ వైస్ సర్పంచ్ కారే శ్రీనివాస్ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి: జేసీ


మాసోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ, ఆర్‌టీవో లీలాప్రసాద్, తదితరులు

పాడేరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతపై వాహన చోదకులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో ఆయన రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్, కరపత్రాల ను ఆవిష్కరించి మాట్లాడారు. వాహన చోదకులు విధిగా తగిన భద్రతా ప్రమాణాలు పాటించాలని, ట్రాఫిక్ నిబంధనలు అనుసరించాలన్నారు. ఫిబ్రవరి 15 తేదీ వరకు జాతీయ రహదారి భద్రతా మాసో త్సవాలు జరుగుతాయన్నారు. అలాగే, ప్రమా దాలు జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో బాధితులను ఆస్పత్రికి తరలించి అత్యవసర వైద్యం అందిస్తే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. ప్రమాదాలు జరిగినపుడు అక్కడున్న వ్య క్తులు సకాలంలో స్పందించాలని జేసీ సూచించారు. ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్, పెద్దవాహనాల్లో సీటు బెల్ట్‌లను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్, ఆర్‌అండ్‌బీ ఈఈ బాల సుం దర బాబు, డీఎంహెచ్‌వో సి. జమాల్ బాషా, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యగుండం సన్నిధిలో తమిళనాడు విద్యాశాఖ కార్యదర్శి


లింగేశ్వర స్వామిని దర్శించుకున్న తమిళనాడు కార్యదర్శి గోపాల్

హుకుంపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మఠం పంచాయతీ ప్రముఖ పర్యాటక కేంద్రమైన మత్స్యగుండం లింగేశ్వరస్వామిని తమిళనాడు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కె. గోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చేపలకు ఆహా రాన్ని అందించి ఆనందంగా గడిపారు. ఆలయ చరిత్ర విశిష్టతను స్థానికుల ద్వారా అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను సన్మానించి ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందించారు. వారితోపాటు రిటైర్డ్ ఐఏఎస్ తమర్బ బాబూరావు నాయుడు, ప్రిన్సిపల్ సింహాచలం, అర్చకులు బాలంనాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుగు ప్రయాణికులతో కిటకిటలాడిన ఆర్టీసీ కాంప్లెక్స్


జనాలతో రద్దీగా ఉన్న పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్

పాడేరురూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ సంకాంతికి వచ్చి తిరుగు ప్రయాణికులతో శుక్రవారం కిటకిటలాడింది. మైదాన ప్రాంతంలోని వివిధ జిల్లాలలో నివాసమంటున్న తమ స్వగ్రామాలకు సంక్రాంతికి వచ్చారు. పండగ మూడు రోజులు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపిన ఉద్యోగులు, విద్యార్థులు, వలస కూలీలు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రైవేటు జీపుల స్టాండ్ శుక్రవారం కూడా రద్దీ కొనసాగింది. విశాఖపట్నం, అనకాపల్లి రాజమహేంద్రవరం, కాకినాడ ప్రాంతాలకు వెళ్లే బస్సులు ప్రయాణికులతో కిటకిటకిలాడాయి.. పాడేరు నుంచి చోడవరం వెళ్లే జీపులు, మైదాన ప్రాంతాలకు వెళ్లే బస్సులకు ఇదే పరిస్థితి నెలకొంది.

చలికి గజగజలాడుతున్న జనం


ముంచంగిపుట్టులో చలి మంటలు కాగుతున్న దృశ్యం

ముంచంగిపుట్టు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చలికి జనం గజగజలాడుతున్నారు. శుక్రవారం చలి తీ వ్రత ఎక్కువయింది. ఉదయం మం చు దట్టంగా కమ్ముకుంది. సాయంత్రం 3 గంటల నుంచే మంచు మొదలయ్యింది. తెల్లవారు జామున ఇళ్ల వెలుపల వస్తువులపై మంచు వల్ల పట్టుకోవడం కూడా కష్టంగా ఉంటోంది. నీరు ఐస్‌ను తలపిస్తోంది గత వారం రోజులుగా చలి తీవ్రత పెరిగింది. రోజు వారి పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సి వస్తుందని వాపోతున్నారు.

గంజాయి సాగు వద్దు: ఏవో



మాట్లాడుతున్న ఏవో శ్రీనివాస్

పెదబయలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర- ఒడిశా సరిహద్దు గ్రామాల గిరిజనులు గంజాయి సాగును వీడి సంప్రదాయ పంటలను పండించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మండలంలోని లింగేటి, ఇంజరి పంచాయితీల పరిధిలోని గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రబీలో సాగు చేస్తున్న వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను మాత్రమే వినియోగించాలని కోరారు. కొండవాగులు, పోడు భూముల్లో గంజాయి సాగు చేస్తున్నట్టు సమాచారం ఉందని, ఈ పంటను స్వచ్ఛందంగా దహనం చేయాలని సూచించారు. లేకుంటే పోలీసులు డ్రోన్‌ల సాయంతో గుర్తించి రైతులపై కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన సహయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

20 నుంచి పశు వైద్య శిబిరాలు

నర్సీపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ, నర్సీపట్నం మండలాలలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని ఏరియా పశువుల ఆస్పత్రి సహాయ సంచాలకులు డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు. ఈ వైద్య శిబిరాలలో పశువులకు, దూడ పెయ్యలకు, మేకలు గొర్రెలకు నట్టల నివారణా మందులు వేస్తామని చెప్పారు. వ్యాధులతో ఉన్న పశువులకు ఉచిత వైద్యం, మందులు అందిస్తామన్నారు. గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు ఉచిత శస్త్ర చికిత్సలు అందిస్తామని ఆయన చెప్పారు. మండలంలోని రెండు ఎంపిక చేసిన గ్రామాలలో ప్రతీ రోజు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. పశు వైద్యాధికారి, పశు వైద్య సహాయకులు, రైతు సేవా కేంద్రంలోని పశు వైద్య సహాయకులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు తెనుగుపూడిలో రీసర్వే

దేవరాపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనుగుపూడి గ్రామంలో శనివారం నుంచి భూముల రీ సర్వే ప్రక్రియను ప్రారంభించనున్నట్టు తహసీల్దార్ లక్ష్మి తెలిపారు. ఇందుకోసం గ్రామ సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగ చేసుకోవాలని కోరారు.

శిథిలావస్థలో ఆర్టీసీ విశ్రాంతి భవనం

వర్షం పడితే శ్లాబ్ నుంచి కారిపోతున్న నీరు

పడిపోతున్న సీలింగ్.. సిబ్బంది భయాందోళన

నైట్ హాల్ట్ డ్రైవర్లు, కండక్టర్లకు విశ్రాంతి కరువు



శిథిల స్థితికి చేరిన ఆర్టీసీ సిబ్బంది విశ్రాంత భవనం ఇదే..



విశ్రాంతి గదిలో పాడైన సీలింగ్, మంచాలు

నర్సీపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బంది విశ్రాంతి కరువవుతోంది. రోజంతా కష్టపడినా కాస్త ఉపశమనం లేకపోతోంది. కారణం వారికి కేటాయించిన విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరడమే!

ఆర్టీసీ బస్ స్టాండ్ భవనం పై అంతస్తులో సిబ్బందికి విశ్రాంతి గది ఉంది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో వర్షం పడినప్పుడు శ్లాబ్ నుంచి నీరు కారిపోతోంది. పెచ్చులు ఊడిపోతుంటే తాత్కాలిక మరమ్మతులు చేశారు. అయినా ఫలితం కనిపించలేదు. నైట్ హాల్ట్ సిబ్బంది, తెల్లవారు జామున డ్యూటీ చేసే సిబ్బంది ఇక్కడ విశ్రాంతి తీసుకుంటారు. పగలంతా డ్యూటీ చేసి రాత్రి విశ్రాంతి తీసుకోవడానికి వచ్చిన నైట్ హాల్ట్ బస్సు సిబ్బంది భయం భయంగా గడపాల్సి వస్తోంది.

నర్సీపట్నం చుట్టు పక్కల గ్రామాలకు చెందిన డ్రైవర్లు, కండక్టర్లకు ఫస్ట్ బస్సు డ్యూటీ పడినప్పుడు రాత్రి బస్ స్టేషన్‌కి వచ్చి విశ్రాంతి గదిలో నిద్రపోయి ఉదయం డ్యూటీకి వెళుతుంటారు. డ్రైవర్లు, కండక్టర్లు క్యారేజీలు తెచ్చుకొని బోజనం ఇక్కడే చేస్తుంటారు. విశ్రాంతి గదిలో కనీసం ఫ్యాన్లు కూడా లేవు. గదిలో ఐరన్ మంచాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పరుపులు దుమ్ము పట్టాయి. దోమల బెడద చాలా ఎక్కువగా ఉండడంతో కంటి మీద కునుకు ఉండడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పడుకుంటే సీలింగ్ అట్టలు తమ మీద పడుతున్నాయని వాపోతున్నారు. సరైన నిద్ర, విశ్రాంతి లేకపోవడంతో ఉదయం లేచి డ్యూటీలకు వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మానసిక ఒత్తిడి, నిద్రలేమితో డ్యూటీలకు వెళ్లాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

శారీరక, మానసిక విశ్రాంతి లేకపోతే ప్రమాదం

ఆర్టీసీ డ్రైవర్లకు మానసిక, శారీరక విశ్రాంతి లేకపోతే ప్రమాదాలకు దారి తీస్తుంది. ప్రతీ రోజు కొన్ని వేల మంది ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తుంటారు. బస్సు నడిపే డ్రైవర్‌కు శారీరక విశ్రాంతి, మానసిక ప్రశాంత చాలా అవసరం. ఆర్టీసి బస్ స్టేషన్‌లోని విశ్రాంతి గదిలో ఆ రెండు దొరకడం లేదు. కనీసం ఫ్యాన్లు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో అధికారులు ఉన్నారు. వేసవిలో ఫ్యాన్లు లేకుండా రెస్ట్ రూమ్‌లో ఎలా పడుకుంటామని సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. మరుగుదొడ్లు కూడా సరిగ్గా పని చేయడం లేదు.

ఈ సమస్యలపై డిపో మేనేజర్ ధీరజ్‌ను వివరణ కోరగా రెస్ట్ రూమ్ పరిస్థితిపై ఆర్టీసీ సివిల్ ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేశామని చెప్పారు. ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం డీఈఈ నివివరణ కోరగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇంటర్వ్యూ..

సూర్యఘర్ యోజనతో విద్యుత్ బిల్లు ఆదా

-కె.శంకరరావు, ఏఈఈ, ఈపీడీసీఎల్



ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా రాయితీతో సోలార్ అందిస్తున్నాం. రూఫ్ టాప్ ఇంటిపై దీన్ని బిగించుకుంటే ప్రతి నెలా విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది. అలాగే తక్కువ విద్యుత్ వినియోగిస్తే నెట్ మీటరు ద్వారా గ్రిడ్ నుంచి పొదుపు బిల్లు వస్తుంది. దీన్ని వినియోగదారుడికి ఈపీడీసీఎల్ చెల్లిస్తుంది. ఇందుకోసం వినియోగదారుడు పాన్, ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా నంబరు, ఫొటో ఇవ్వాలి.

ప్ర: వినియోగదారులకు అందిస్తున్న రాయితీలు ఏమిటి?

జ: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా రాయితీతో సోలార్ అందిస్తున్నాం. రూఫ్ టాప్ ఇంటిపై సోలార్ బిగించుకుంటే ప్రతి నెలా విద్యుత్ బిల్లు ఆదా ఉంటుంది.

ప్ర: దీనికోసం వినియోగదారుడు ఏం ఇవ్వాలి, ఏం చేయాలి?

జ: వినియోగదారుడు పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, ఫొటో ఇవ్వాలి. వీటిని ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.

ప్ర: ప్రభుత్వం రాయితీ ఏ విధంగా ఇస్తుంది.. బ్యాంకు రుణం కల్పిస్తుందా?

జ: ఒక కిలోవాట్‌కి రూ.30 వేలు రాయితీ ఇస్తుంది. రెండు కిలోవాట్‌కి రూ.60 వేలు, మూడు కిలోవాట్‌కి రూ.78 వేలు రాయితీ ఇస్తుంది. ఇది కేవలం గృహ అవసరాలకు మాత్రమే ఇస్తుంది. ప్రభుత్వం రాయితీ కాగా, మిగతాది వినియోగ దారుడు చెల్లించాల్సిన సొమ్ముకు బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తుంది.

ప్ర: దీంతో ప్రయోజనాలు ఏమిటి?

జ: ఇది ప్రకృతి వరం. పగలంతా సూర్యరశ్మి ద్వారా వినియోగమవుతుంది. రాత్రి పూట మాత్రమే విద్యుత్‌ను తీసుకుంటుంది. దీనివల్ల ప్రతీ నెల బిల్లు తగ్గుతుంది. వినియోగదారుడు వినియోగించే దానికన్నా తక్కువ వినియోగిస్తే నెట్ మీటరు ద్వారా గ్రిడ్ నుంచి పొదుపు బిల్లు రావడం వల్ల ఈపీడీసీఎల్ వినియోగదారుడికి చెల్లిస్తుంది. ప్రతీ మూడు నెలలకు రూ.2.9 జనరేట్ అవుతుంది.

-దేవరాపల్లి, ఆంధ్రజ్యోతి

అన్నగారు.. ఇంకెప్పుడు గుర్తుకొస్తారు?

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

నిర్లక్ష్యంగా వదిలేసిన విగ్రహం

అభిమానులు, పార్టీ శ్రేణుల్లో తీవ్ర సహనం



పదేళ్లుగా నిర్లక్ష్యంగా వదిలేసిన ఎన్టీఆర్ విగ్రహం

గొలుగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రజలు, అభిమానులు, పార్టీ శ్రేణుల్లో అన్నగారిగా చెరగని ముద్ర వేశారు. ఈ పేరు వింటేనే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉబ్బితబ్బి బవుతారు. ఎన్ని తరాలు మారినా అన్నగారు అన్న పేరును మాత్రం చిరస్థాయిగా నిలిపేశారు. ఇంత చరిత్ర సృష్టించిన అన్నగారు విగ్రహం గొలుగొండ మండల కేంద్రంలో నిర్లక్ష్యంగా వదిలేయడం.. అది కూడా పదేళ్లుగా అలాగే ఉండడం.. ప్రస్తుతం రంగులు వెలసిపోవడం.. వెరసి ఆయన అభిమానులను తీవ్రంగా కలచి వేస్తోంది. చివరికి ఆయన వర్ధంతి రోజు వచ్చినా విగ్రహం ఎవరికీ గుర్తుకు రాకపోవడంతో చాలా మంది జీర్ణించుకోలేకపోతున్నారు.

గొలుగొండలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయడానికి టీడీపీ శ్రేణులు 1995లో కొనుగోలు చేశారు. అప్పటి పార్టీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు ఇంటి వద్ద విగ్రహాన్ని దించారు. నాటి నుంచి నేటివరకూ అప్పలనాయుడే పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే ఎన్టీఆర్ విగ్రహాన్ని మాత్రం ప్రతిష్ఠించకుండా నిర్లక్ష్యంగా వదిలేయడాన్ని చాలా మంది జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్టీఆర్ జయంతి, వర్ధంతులను చిత్రపటాలను ఏర్పాటుచేసి నిర్వహిస్తున్నారే తప్పితే, మండల కేంద్రంలో విగ్రహం ప్రతిష్ఠించాలన్న విషయం వారికి గుర్తుకు రాకపోవడంపై అభిమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అన్నగారు విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని పార్టీ శ్రేణులు, అభిమానులు కోరుతున్నారు.

షుగర్ ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కానిచ్చేది లేదు

- కాపాడే బాధ్యత నాదే: ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు
- ఫ్యాక్టరీ అభివృద్ధికి కార్మికులు సహకారం అందించాలి



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఎప్పటికీ సహకారం రంగంలోనే నడుస్తుందని, దీన్ని ప్రైవేటుపరం కానిచ్చేది లేదని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు స్పష్టం చేశారు. వేతన బకాయిలు ఇతర సమస్యలపై గోవాడ ఫ్యాక్టరీలో కార్మికులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో, శుక్రవారం గోవాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కార్మికుల వేతనాలు, రైతుల బకాయిల చెల్లింపుల్లో సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని కార్మికులు సహకరించాలని కోరారు. గోవాడ ఫ్యాక్టరీని కాపాడే బాధ్యత తనదని, ఈ విషయంలో కార్మికులు, రైతులు ఆందోళన చెందనవసరం లేదని ఆయన భరోసా ఇచ్చార. గోవాడను ప్రైవేటుకి అమ్మేస్తారంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, అటువంటి ప్రచారాలను ఎట్టిపరిస్థితుల్లో నమ్మవద్దని కోరారు. గోవాడను ఆర్థికంగా గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టి, ఫ్యాక్టరీకి తిరిగి పూర్వ వైభవం తీసుకుని వచ్చే బాధ్యత తీసుకుంటానన్నారు. ఫ్యాక్టరీ స్థితిగతులపై అవగాహన ఉందని, కార్మికులు కూడా సహకారం అందించి ఫ్యాక్టరీ గాడిపడేందుకు చేయూత అందించాలని కోరారు. సమావేశంలో ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు కేవీవీఎస్ భాస్కరరావు తదితరులు మాట్లాడారు. కార్మిక సంఘం నాయకులు శరగడం రామునాయుడు, ఫ్యాక్టరీ అధికారులు పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్‌పై హామీలు ఏమయ్యాయి..?

- ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి

చోడవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, చెరకు రైతుల సమస్యలపై కూటమి నేతలు మహాజన సభసాక్షిగా ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడం శోచనీయమని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు విమర్శించారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గోవాడ చెరకు రైతులు, కార్మికుల బకాయిల చెల్లింపులపై కూటమి నేతలు ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, పీవీఎస్ఎన్ రాజు నుంచి కనీస స్పందన లేకపోవడంతో సంక్రాంతి రోజున కూడా బకాయిలు, వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మహాజన సభలో ఇచ్చిన హామీలపై స్పష్టత లేకపోవడం దారుణమన్నారు. రైతుల బకాయిలు, కార్మికుల గ్రాట్యుటీ, పీఎఫ్ బకాయిలపై యాజమాన్యం స్పందన సరిగా లేదని, మద్దతు ధర టన్నుకు రూ.4 వేలు కూడా కూటమినేతలు అమలు చేయలేక ప్రకటనలతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. ఫ్యాక్టరీ వ్యవహారాలపైనా యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపైనా సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల సమస్య తీర్చండి

వేతన బకాయిలపై ఎమ్మెల్యేకు సీఐటీయూ వినతి

చోడవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్స్ కార్మికుల వేతనాలు, ఇతర బకాయిలు చెల్లించాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకు సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎమ్మెల్యేను కలిసిన సీఐటీయూ నాయకులు కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందించారు. కార్మికులను ఆదుకోవడానికి చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గూనూరు వరలక్ష్మి, ప్రేమచంద్రశేఖర్, ఎస్‌వీ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు పావు కిలో వెండి వితరణ

మాడుగుల రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరులో కొలువైన మోదకొండమ్మ అమ్మవారికి స్థానిక భక్తులు పావు కిలో వెండి వితరణగా అందించారు. గొల్లవిల్లి వరహామూర్తి, నాగమణి దంపతుల కుమార్తెలు లలిత, షష్మా, శ్రీలక్ష్మి పావు కిలో వెండిని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

దేవరాపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జీడిపిక్కలను ప్రభుత్వమే తగిన మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. వాలాబు పంచాయతీలోని పలు గ్రామాల్లో జీడి తోటలను పరిశీలించి గిరిజనులతో ఆయన మాట్లాడారు. పంట నష్ట పోయిన వారికి పరిహారం చెల్లించకపోతే దశల వారీ ఉద్యమం చేపడతామని చెప్పారు.

జీడిపిక్కలు కొనుగోలు చేయాలని పాదయాత్ర



మద్దతు ధర కల్పించాలని పాదయాత్ర చేస్తున్న నాయకులు, గిరిజనులు

రావికమతం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు పండించే జీడి పిక్కలను రైతు సేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు చీమలపాడు పంచాయతీలో నేరేడుబంద నుంచి అజయ్‌పురం వరకూ సీపీఎం ఆధ్వర్యంలో ఐదు కిలోమీటర్ల వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుఉతూ జీడి పిక్కలకు గిట్టుబాటు ధర లేక గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా దళారులకు విక్రయించడం వల్ల మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే ప్రభుత్వం కొనుగోలు చేస్తే మోసాలకు అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కిల్లో పొట్టిదొర, వంతల చిరంజీవి, గిరిజనులు పాల్గొన్నారు.

గ్రామాలను వణికిస్తున్న చలిపులి

మాడుగుల రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలను చలిపులి వణికిస్తున్నది. శుక్రవారం నుంచి వేకువ జామున, సాయంత్రం సమయాల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు చలిని తట్టుకోలేకపోతున్నారు. దీంతో రగ్గులు, స్వెట్టర్లు ధరిస్తున్నారు. ప్రయాణాలు చేసే వరకు నరకం చూస్తున్నారు.

గండిమారమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు



గండిమారమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

దేవరాపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట గ్రామ దేవత గండిమారమ్మ తీర్థం సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ కర్రిపుష్ప, టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ, నాయకులు కర్రినాయుడు, ఆదిరెడ్డి సూర్యనారాయణ, కొట్యాడరవి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ తీర్థం

కె.కోటపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగన్నదొరపాలెం గ్రామంలో శుక్రవారం మరిడిమాంబ తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ వెలగల పైడంనాయుడు ఆధ్వర్యంలో ఈ తీర్థంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతలు తీర్థాలు సంప్రదాయాలకు నిదర్శనాలు అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెలగల శ్రీను, పిల్లల రమణ, జి.రమణేశ్వరరావు, బండారు దేముడు, బండారు దేమున్నాయుడు, ఆర్.నారాయణమూర్తి, నంది వెంకటరావు, భక్తులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎం చంద్రబాబు అండ: ఎమ్మెల్యే



బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

చోడవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు అండగా సీఎం చంద్రబాబు ఉంటారని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం మంగళాపురం గ్రామానికి చెందిన రైతు దానబోయిన ధనలక్ష్మిరావు మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి సీఎం సహాయనిధి కింద రూ.50 వేలు సాయం మంజూరైంది. ఈ మేరకు సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే శుక్రవారం బాధిత కుటుంబానికి అందచేశారు.

కాలువను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి



కార్యదర్శికి ఫిర్యాదు చేసున్న కాలనీ వాసులు

రోలుగుంట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని కొట్టి వారి వీధిలో కాలువను ఆక్రమించిన బంటు అచ్చియ్యనాయుడు, వారి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ కార్యదర్శి రాజశేఖర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పూర్వం నుంచి స్థానిక వీరబ్రమ్మం గుడి పక్క నుంచి మొదలైన కాలువ కోటిపల్లివీధి, దనిమిరెడ్డి వారి వీధి, కొట్టి సంజీవరావు ఇంటి పక్క కాలువ ద్వారా మురుగునీరు పారుతుందన్నారు. ఇటీవల అచ్చియ్యనాయుడు కాలువకు అడ్డంగా మట్టిగట్టు వేసి సిమ్మెంట్ రేకులను ఏర్పాటు చేసి ఆక్రమణ చేశారని, దీంతో మురుగు పారకుండా దుర్గంధం వెదజల్లుతున్నదని తెలిపారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న కొండబాబు తదితరులు

నాతవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రవాసాంధ్రులు నిర్వహించిన వాలీబాల్, క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్‌లో విజేతలకు శుక్రవారం బహుమతులను ప్రదానం చేశారు. మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు చేతుల మీదుగా నగదు, షీల్డులను అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కెఎస్ఆర్ టీమ్ సభ్యులు నిర్వహించిన టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, నిర్వాహకులు శెట్టి సతీశ్, పైల వెంకటరమణ, పి.కిరణ్, నాయకులు మద్దు కన్నబాబు, చింతకాయల శ్రీనువాసు,పైల వరహలబాబు, శెట్టి నానాజీ పాల్గొన్నారు.

కొంగశింగిలో సీతారాముల తీర్థం



కొంగసింగిలో రామాలయంలో భజనలు చేస్తున్న భక్తులు

కృష్ణాదేవిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని కొంగశింగి గ్రామంలో శుక్రవారం సీతారాముల తీర్థాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, చోద్యం, పల్లావూరు, గొలుగొండ, జోగంపేట, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి ఈ తీర్థానికి ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా రామాలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తాడిపెద్దులను గ్రామంలో ఊరేగింస్తూ పలు భక్తి గీతాలను పాడారు. కార్యక్రమంలో సర్పంచ్ యలంమంచిలి నూకరత్నం, నాయకులు వై.వరహాలబాబు, సత్యనారాయణ, మల్లేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా తీర్థ మహోత్సవాలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నాయకులు

గొలుగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తీర్థ మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మదేవిపేట, కొత్తపాలెం గ్రామాల్లో ముగ్గులు పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు నాయకులు బహుమతులు అందించారు. అలాగే సాలికమల్లవరం రామాలయం వద్ద మహిళలతో ఏర్పాటు చేసిన కోలాటం అలరించింది. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు అడిగర్ల అప్పలనాయుడు, సుర్ల బాబ్జి, పెదిరెడ్ల మల్లేశ్వరరావు, రాయపురెడ్డి జమీలు, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ భాగ్యవతికి సత్కారం



డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న తహసీల్దార్ భాగ్యవతిని సత్కరిస్తున్న ఉద్యోగులు

కె.కోటపాడు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన తహసీల్దార్ పి.భాగ్యవతిని శుక్రవారం ఉద్యోగులు సన్మానించారు. ఏపీ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ-2025 క్యాలెండర్లను, డైరీలను అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్లె శ్రీరామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎస్టీ రామకాను, ప్రధాన కార్యదర్శి ఎన్.అనంతరామయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పూడి సురేశ్, అనకాపల్లి డివిజన్ అధ్యక్షుడు గణేశ్ తహసీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కోశాధికారి కె.గౌరీశంకర్, సభ్యులు జ్యోతి, విజయశ్రీ, శివ, గంగునాయుడు, వెంకటేశ్, నాయుడు, జగదీశ్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఏడు దుకాణాలపై కేసులు

గొలుగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఏడు కిరాణా దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. నిత్యావసర సరకుల తూకాల్లో మోసం జరుగుతుందన్న స్థానికుల ఫిర్యాదుల మేరకు శుక్రవారం తూనికలు, కొలతల శాఖ డివిజనల్ అధికారి అనురాధ తనిఖీలు నిర్వహించారు. ఏడు కిరాణా దుకాణాల్లో సరకుల తూకాల్లో తేడాలను గుర్తించారు. ఈ మేరకు ఆయా షాపులపై కేసులు నమోదు చేసినట్టు ఆ శాఖ అధికారి అనురాధ తెలిపారు. కాగా, తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారన్న విషయం తెలిసి కొత్తూరు, జోగంపేట గ్రామాల్లో పలు దుకాణాలను మూసి వేశారు.

వీఆర్వోల సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలి

దేవరాపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్వోల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరించాలని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్లె శ్రీరామమూర్తి కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సంఘ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పోతల శంకరు, దొర తదితరులు పాల్గొన్నారు.

నేడు తాండవ నీటి సంఘాల అధ్యక్షుల సమావేశం

నాతవరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తాండవ రిజర్వాయర్ నీటి సంఘాల అధ్యక్షులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు. నల్లగొండ మ్మతల్లి ఆలయం సమీపంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తాండవ అత్యవసర పనుల గురించి సమావేశంలో చర్చించనున్నట్టు ఆయన తెలిపారు.

నేడు మండల సమావేశం

మాకవరపాలెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని సూచించారు.

నలుగురు జూదరుల అరెస్టు

రావికమతం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పి.పొన్నవోలు పంచాయతీ శివారు జి.చీడిపల్లి గ్రామ శివారులో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ.5 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

90 గంటలు పని చేయాలా!?

ఎల్ అండ్ టి చైర్మన్ వ్యాఖ్యలు మరింత శ్రమదోపిడీకి గురిచేసేలా ఉన్నాయంటూ ఉద్యోగుల ధ్వజం



ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్
ఎల్ అండ్ టీ చైర్మన్



- ఇంట్లో కూర్చుని భార్యను ఎంతసేపు అలా చూస్తూ ఉంటారనడంపై తీవ్ర దుమారం
- మహిళలను అవమానించడమేనంటూ ఆగ్రహం
- పని ప్రదేశంలో వాతావరణం దెబ్బతినడంతోపాటు పనితీరుపైనా ప్రభావం చూపుతుందంటున్న మానసిక వైద్యులు

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)
"ఉద్యోగులు వారానికి 90 గంటలు పనిచేయాలి. ఇంట్లో కూర్చుని భార్యను ఎంతసేపు చూస్తారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని జీవిత భాగస్వామికి చెప్పండి. ఆదివారం మీతో పని చేయించలేకపోతున్నందుకు చింతిస్తున్నాను. అలా చేయించగలిగితే నాకు సంతోషం. ఆదివారం నేను కూడా పనిచేస్తాను"...

అంటూ ఉద్యోగులను ఉద్దేశించి ఇటీవల ఎల్ అండ్ టీ సంస్థ చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేకెత్తిస్తున్నాయి. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల వేదికగా నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. వివిధ రంగాలకు చెందిన సెలబ్రిటీలు కూడా గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. ఈ వ్యాఖ్యలు మహిళలను అవమానించడమే కాకుండా మరింత శ్రమ దోపిడీకి గురిచేసేలా ఉన్నాయంటూ పేర్కొంటున్నారు.

ఎల్ అండ్ టీ చైర్మన్ సుబ్రహ్మణ్యనే కాదు... గతంలో ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి కూడా దేశం అభివృద్ధి పథంలో సాగాలంటే యువత కనీసం 70 గంటలు పనిచేయాలని చెప్పుకొచ్చారు. ఆయన వ్యాఖ్యలపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. తాజాగా ఎల్ అండ్ టీ చైర్మన్ మరో అడుగు ముందుకువేసి ఏకంగా వారానికి 90 గంటలు పనిచేయాలన్నారు. ఈ వ్యాఖ్యల పట్ల వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు అసహనాన్ని వ్యక్తంచేస్తున్నారు. ఇంటికి కూడా దూరంగా ఉండాలని చెప్పడం ద్వారా ఉద్యోగులను కనీసం మనుషులుగా కూడా గుర్తించలేని స్థితికి ఇటువంటి పెద్ద మనుషులు చేరుకుంటున్నారంటూ ఐటీ ఉద్యోగి జాహ్నవి పేర్కొన్నారు. ఇప్పటికే గంటల తరబడి పనిచేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని, వృత్తిపరమైన ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఇంటికి మించిన రిలాక్సేషన్ సెంటర్ మరొకటి ఉండదని ఒక ప్రముఖ మాల్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న రమేష్ పేర్కొన్నారు.

పని భారంతో ఇబ్బందులు

రోజులో కొంత సమయం పనికి, మరికొంత సమయం వ్యక్తిగత వ్యవహారాలకు, మరికొంత సమయం నిద్రకు కేటాయించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎనిమిది గంటల పని విధానమే అమలులో ఉన్నప్పటికీ అనేక సంస్థలు పది గంటలకుపైగానే పని చేయించుకుంటున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అయితే కనీసం 10 నుంచి 12 గంటలు పనిచేస్తు న్నారు. ఇటువంటి పరిస్థితుల్లో 90 గంటలు అంటే ప్రతిరోజూ 13 గంటలు పనిచేయాల్సి ఉంటుందని, దీనివల్ల ఉద్యోగి పూర్తిగా యంత్రం మాదిరిగా మారిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్న భావనను పలువురు వ్యక్తంచేస్తున్నారు. ఇది పని సామర్థ్యాన్ని, పనిచేసే ప్రదేశంలోని వాతావరణాన్ని కూడా నాశనం చేస్తుందని మానసిక నిపుణులు చెబు తున్నారు.

మహిళలను అవమానించే రీతిలో వ్యాఖ్యలు



ఇంట్లో ఉండే మహిళలను చూడ లేమన్న రీతిలో ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. కుటుంబ విలువల గురిం చి తెలిసిన వాళ్లు ఎవరూ అలా మాట్లాడరు. పని ప్రాంతాల్లో తీవ్రమైన ఒత్తిడి, అలసటతో ఇబ్బంది పడేవాళ్లకు ఇల్లు ఒక రిలాక్సేషన్ సెంటర్ మాదిరిగా ఉపయోగపడుతుంది. కొంత సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపడం వల్ల ఉత్తేజితమై మరింత ఉత్సా హంగా పనిచేసేందుకు అవకాశం ఉంటుంది. మహి ళలు కూడా అనేక రంగాల్లో పనిచేస్తున్నారు. మహి ళలు అందరూ ఇళ్లల్లోనే ఉంటున్నట్టు మాట్లాడడం భావ్యం కాదు. మహిళా రంగాన్ని చిన్నచూపు చూసే లా వ్యాఖ్యలు ఉన్నాయి. భార్యభర్తలు వారాంతంలో కూడా కలిసి ఉండకపోతే వైవాహిక జీవితం ఎటువైపు వెళుతుందో ఆయనకు తెలియదా. ఆయన ఇంట్లో ఉన్న వాళ్లంతా అలానే పనిచేస్తున్నారా చెప్పాలి. ఒక రకంగా చెప్పాలంటే ఇది శ్రమ దోపిడీ చేసేందుకు వేస్తున్న ప్రణాళికే. - **సీహెచ్ సంధ్య, గృహిణి**

పనితీరుపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశం



పరిధికి మించి పనిచే యడం వల్ల ఇబ్బందులు ఎదురవు తాయి. తీవ్రమైన ఒత్తిడికి గురై ఇతర ఇబ్బందులు వేధిస్తాయి. ఇది రోజువారీ పనితీరును మరింత దిగజార్చే అవకాశం ఉంది. ఉద్యోగులు ప్రశాంతంగా పనిచేస్తున్నా రంటే దానికి జీవిత భాగస్వామి, కుటుంబ సభ్యులు సహకారమే కీలకం అన్న విషయాన్ని గుర్తించాలి. పని ఒత్తిడి తట్టుకోలేక ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ మధ్యకా లంలో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగళూరులో ఆత్మ హత్య చేసుకున్నారు. గంటల తరబడి పనిచే యడం వల్ల ఒత్తిడి, చికాకు, డిప్రెషన్ వంటి సమస్యలు వేధిస్తాయి. కొన్ని పనులు శారీరక, మానసిక సమస్యలు వచ్చేందుకు కారణమ వుతాయి. వారానికి 90 గంటలు పనిచేయడం వల్ల అనేక ఇబ్బందులు ఉంటాయి. - **పూజిత జోస్యుల, మానసిక నిపుణులు**

గంటల తరబడి కూర్చున్నా ఫలితం ఉండదు



- పల్లేడ జగదీశ్వరరావు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఏ రంగంలో అయినా ఎనిమిది గంటలకు మించి పని చేయకూడదు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఈ పరిధి ఎప్పుడో దాటిపోయింది. అధికారికంగా ఎనిమిది గంటలే పని చేయాలి. కానీ, మేము పది గంటలకుపైగా పనిచేస్తున్నాం. దీనికి తోడు ఇంటికి వెళ్లిన తరువాత కూడా అత్యవసర పరిస్థితుల్లో కంప్యూటర్ల ముందు గంటల తరబడి కూర్చోవాల్సి వస్తోంది. ఈ తరహా ఒత్తిడి నుంచి రిలాక్స్ అయి మెరుగ్గా పని చేసేందుకు కుటుంబ వాతావరణమే దోహదం చేస్తుంది. అటువంటి కుటుంబానికి దూరంగా ఉంటే మెంటల్ టెన్షన్ పెరుగుతుంది. ఇది రోజువారీ పనితీరుపైనా ప్రభావం చూపిస్తుంది. ప్రశాంత మనసుతో పనిచేయడం వల్ల మంచి ఉత్పత్తి సాధ్యమవుతుంది. పనిపై దృష్టి సారించలేని స్థితిలో ఆఫీసులకు వచ్చి గంటల తరబడి కూర్చుని పనిచేసినా ప్రయోజనం ఉండదు. పది గంటలు కూర్చుని పనిచేస్తున్నందుకే అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మెడనొప్పి, కంటి సమస్యలు, తలనొప్పి వంటి ఇబ్బందులు అనేకం వేధిస్తున్నాయి.

నేడు వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

భారీ ఎత్తున ఏర్పాట్లు
- విద్యుద్దీపాలు, పూలమాలలతో ఆలయం అలంకరణ
- పలుచోట్ల భారీ విద్యుత్ సెట్టింగులు
- ఆర్టీసీ బస్సులు దారి మళ్లింపు

అనకాపల్లి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పట్టణంలోని వేల్పులవీధి (మెయిన్ రోడ్డు) గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం జరగనుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూలదండలతో అలంకరించారు. సుదీర్ఘ చరిత్ర వున్న వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఏటా సంక్రాంతి తరువాత వచ్చే శనివారంనాడు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ ఏడాది ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు.

మెయిన్‌రోడ్డులో చిననాలుగురోడ్ల జంక్షన్ నుంచి శారదా నది వరకు, నెహ్రూచౌక్ నుంచి ఇటు ఆర్టీసీ కాంప్లెక్స్, అటు విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వరకు భారీ ఎత్తున విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టారు. ఎన్టీఆర్ జంక్షన్, సత్య థియేటర్, తదితర ప్రాంతాల్లో భారీ విద్యుత్ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారుజామున గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. భక్తులు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేశామని చైర్మన్ బాబు తెలిపారు. గౌరీ పరమేశ్వరుల అనుపమహోత్సవం శనివారం మధ్యాహ్నం ప్రారంభమై ఆదివారం రాత్రి వరకు సాగుతుంది. వేడుకల్లో భాగంగా నేల వేషాలు, ప్రధాన కూడళ్లల్లో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.



మెయిన్‌రోడ్డులో గౌరీ పరమేశ్వరుల ఆలయం



సత్య థియేటర్ వద్ద విష్ణుమూర్తి అవతారంలో విద్యుత్ సెట్టింగ్

ఆర్టీసీ బస్సులు దారి మళ్లింపు

వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల కారణంగా శనివారం ఆర్టీసీ బస్సులను మళ్లింపు మార్గాల్లో నడపనున్నట్టు ఇన్‌చార్జి డీఎం రవిచంద్ర చెప్పారు. నెహ్రూచౌక్, మెయిన్ రోడ్డు, సుంకరమెట్ట జంక్షన్ మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లే బస్సులు పూడిమడక రోడ్డు, జాతీయ రహదారి మీదుగా నడుపుతామన్నారు. విజయనగరం, తగరపువలస వైపు వెళ్లే బస్సులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రింగురోడ్డు, రైల్వేస్టేషన్, ఉడ్‌పేట, నెహ్రూచౌక్ మీదుగా రాకపోకలు సాగిస్తాయని, మధ్యాహ్నం తరువాత సుంకరమెట్ట జంక్షన్ నుంచి విశాఖ రోడ్డులోకి మళ్లి, జాతీయ రహదారి, పూడిమడక రోడ్డు మీదుగా కాంప్లెక్స్‌కు వస్తాయన్నారు.. చోడవరం, మాడుగుల, దేవరాపల్లి వైపు వెళ్లే బస్సులు మధ్యాహ్నం తరువాత నుంచి విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వరకే నడుస్తాయని, అక్కడి నుంచి తిరుగుముఖం పడతాయని చెప్పారు.



మెయిన్‌రోడ్డులో అయోధ్య రామాలయం సెట్



ఆలయం వద్ద విద్యుద్దీపాలతో కనకదుర్గమ్మ సెట్టింగ్

సర్కారీ బడులు వెలవెల

... 1వ పేజీ తరువాయి

చెప్పడానికి ఒక ఉపాధ్యాయుడు వున్నారు. విద్యార్థులు ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో హైస్కూల్‌కి వెళ్లిపోతారు. ఒకటో తరగతిలో ఎవరైనా చేరితే సరి.. లేకుండా పాఠశాల మూతపడుతుంది. అలాగే వెంకయ్యపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు వున్నారు. నాలుగేళ్ల నుంచి ఈ ఇద్దరే చదువుకుంటున్నారు. వీరికి పాఠాలు బోధించడానికి ఒక టీచర్ ఉన్నారు. బూరుగుపాలెంలో కూడా ఇదే పరిస్థితి. ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు.

మల్లవరం పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, పెద్దిపాలెంలో ఆరుగురు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, బుచ్చన్నపాలెంలో ఏడుగురు విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, జి.కోడూరు పాఠశాలలో తొమ్మిది మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, నగరం గ్రామంలో అత్యధికంగా 14 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఇటువంటి పాఠశాలలపై మండల విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎంఈవో-1 జాన్‌ప్రసాద్ పాయకరావుపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా, రోలుగుంట ఇన్‌చార్జి ఎంఈవోగా త్రిపాత్రాభినయనం చేస్తుండడమే ఇందుకు కారణమన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

అప్పన్న ఆభరణాల రికార్డులు పరిశీలన

సింహాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధీనంలోని స్వర్ణ, రజత ఆభరణాల రికార్డులను దేవదాయ శాఖ జ్యూవెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు శుక్రవారం పరిశీలించారు. స్వామివారికి భక్తులు సమర్పించిన ఆభరణాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, వాటిని పరిశీలించా లని కోరుతూ కడప జిల్లా బ్రహ్మంగారిమఠానికి చెందిన కె.ప్రభాకరాచారి, దేవదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కమిషనర్ కాకినాడ ఆర్‌జేసీని విచారణకు ఆదేశించారు. ఆయన ఆలయానికి వచ్చి జేఈఓ పల్లంరాజుతో కలిసి పరిశీలన ప్రారంభించారు. ఏఈఓ, ఇతర సిబ్బందితో కలిసి రాజగోపురంలోని ప్రత్యేక గదిలో రికార్డుల పరిశీలన చేపట్టారు. ఈ విషయం తెలిసిన ఫిర్యాదుదారు ప్రభాకరాచారి, వీహెచ్‌పీ నేతలతో కలిసి ఆలయానికి చేరుకున్నారు. పల్లంరాజును కలవాలని యత్నించగా అందుకు ఆయన నిరాకరించారు. ఈ సందర్భంగా ప్రభాకరాచారి విలేకరులతో మాట్లాడుతూ అప్పన్న ఆభరణాల విషయంలో తేడాలున్నాయనడానికి అధికారుల తీరే నిదర్శనమని ఆరోపించారు. ఎటువంటి బెదిరింపులకు భయపడనని, తన వద్ద ఉన్న ఆధారాలతో హైకోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు. ఈఓ వేంద్ర త్రినాథరావును వివరణ కోరగా విచారణ అధికారి కోరిన రికార్డులు అందజేయడమే తన విధి అని తెలిపారు. నేరం రుజువైతే దోషులపై చట్టపరంగా చర్యలుంటాయని చెప్పారు.

అన్నదాతలకు ఊరట

... 1వ పేజీ తరువాయి

మంజూరైన రైతులు ఈపీడీసీఎల్ సూచించిన రుసుము చెల్లించిన తరువాత, విద్యుత్ సిబ్బంది సంబంధిత రైతు పొలంలో మోటారుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా మార్పులు తెచ్చారు. ఇంతవరకు బాగానే వున్నప్పటికీ కొత్త విధానంలో దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ విద్యుత్ కనెక్షన్ మంజూరు కాకపోవడంతో అసంతృప్తి చెందుతున్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఎప్పుడు ఇస్తారంటూ ఈపీడీసీఎల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 150 మంది రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్నట్టు తెలిసింది. జిల్లాలోని ఇతర ప్రాంతాలతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నెలకొన్న ఈ పరిస్థితి ప్రభుత్వం దృష్టికి రావడంతో పాలకులు స్పందించారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రాధాన్యతాక్రమంలో విడతల వారీగా విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని ఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించింది. దీంతో కొద్ది రోజుల నుంచి విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు.

దశల వారీగా విద్యుత్ కనెక్షన్లు

ఎ.రామకృష్ణ, ఈపీడీసీఎల్ డీఈఈ, వడ్డీపట్నం.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు ప్రభుత్వం విడతల వారీగా అనుమతి ఇస్తున్నది. గత ఏడాది డిసెంబరులో తొలివిడత కోటా మంజూరుకాగా, ఏప్రిల్‌లోపు దరఖాస్తు చేసిన వారికి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం. రెండో విడత కోటా కింద ఈ నెలలో 70 కనెక్షన్లు మంజూరుకాగా వాటిని జూలై 25వ తేదీలోగా దరఖాస్తు చేసిన రైతులకు మంజూరు చేశాం. మా శాఖ ఉన్నతాధికారుల నుంచి అనుమతి వచ్చిన వెంటనే మిగిలిన రైతులకు కూడా కనెక్షన్లు ఇస్తాం.

కోడి పందేలపై దాడి

- ముగ్గురి అరెస్టు
- రెండు కోడి పుంజులు స్వాధీనం

రావికమతం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్టు రావికమతం ఎస్‌ఐ ఎం. రఘువర్మ తెలిపారు. మండలంలో చినపాచిల శివారులో కోడి పందేలు ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో శుక్రవారం మధ్యాహ్నం దాడి చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా కోడి పందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి నుంచి రెండు పందెం కోడి పుంజులు, రూ.1,100 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రఘువర్మ తెలిపారు.



చినపాచిలలో కోడి పందేల ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్న పోలీసులు

పీఎంఎఫ్‌ఎంఈలో రిసోర్స్ పర్సన్స్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 'ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంపీఈ)ను సమర్థంగా అమలు చేసేందుకు మండలస్థాయిలో రిసోర్స్ పర్సన్స్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఆర్‌డీఏ పీడీ శచీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, కంప్యూటర్, ఇంటర్‌నెట్ రంగంలో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. ప్రయాణాలు చేసేందుకు ఆసక్తి కలిగి ఉండడంతోపాటు సొంత స్మార్ట్‌ఫోన్ ఉండాలన్నారు. 1-11-2024 నాటికి 21 సంవత్సరాలు దాటి, 30 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మండల కేంద్రాల్లోని వెలుగు కార్యాలయాల్లో ఈ నెల 24వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు 27వ తేదీన పెందుర్తిలోని మహిళా ప్రగతి కేంద్రం (టీటీడీసీ)లో ఇంటర్వ్యూలు వుంటాయని పేర్కొన్నారు.

సాంకేతికతలో స్వావలంబన సాధించాలి

- విశాఖపట్నం ఐఐఎం వ్యవస్థాపక దినోత్సవంలో డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్



అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ వి.కామత్

విశాఖపట్నం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో విద్య, సాంకేతికత, పరిశ్రమ రంగాల మధ్య సమన్వయం అవసరమని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) చైర్మన్ డాక్టర్ సమీర్ వి.కామత్ అన్నారు. గంభీరంలోగల ఐఐఎంవి 11వ వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కామత్ 'డిఫెన్స్ ఆర్ అండ్ డి -ద రోడ్ ఎహెడ్' అనే అంశంపై మాట్లాడుతూ ప్రాథమిక పరిశోధన అంటే విద్య, అనువర్తిత పరిశోధన, సాంకేతికత, ఉత్పత్తి అభివృద్ధి (అప్లయిడ్ రీసెర్చ్), పరిశ్రమల మధ్య సమన్వయంలో వెనుకబడి ఉన్నామని పేర్కొంటూ దానిని అధిగమించాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి ప్రక్రియను నడిపించడంలో సాంకేతిక బదిలీ, పరిశ్రమల సహకారం కీలకమని, దానిని విస్మరించరాదన్నారు. సాంకేతికతలో స్వావలంబన సాధించినప్పుడే దేశం పురోగతి సాధిస్తోందని అభిప్రాయపడ్డారు. ఐఐఎం గవర్నింగ్ బాడీ సభ్యురాలు మాళవిక ఆర్. హరిత మాట్లాడుతూ విద్య, జ్ఞానం, అభివృద్ధి, సామరస్యం, పురోగతిని పెంపొందించడంలో ఐఐఎంవి ముందువరుసలో ఉండాలని ఆకాంక్షించారు. ఐఐఎం డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ గడచిన పదేళ్లుగా అన్ని ప్రమాణాలతో విద్యా బోధన జరుగుతుందన్నారు. సంస్థలు/పరిశ్రమలను సమర్థంగా నిర్వహించేందుకు వీలుగా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా వారిని తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రతిభ కనబర్చిన ఎనిమిది మంది విద్యార్థినీ, విద్యార్థులకు డాక్టర్ కామత్ ప్రశంసాపత్రాలతోపాటు గ్రాంట్లు అందజేశారు. సంస్థ డీన్ ఆచార్య కావేరి కృష్ణన్ స్వాగతం పలకగా అకడమిక్ డీన్ ఎం.విజయభాస్కర్ వందన సమర్పణ చేశారు.

మందగించిన ధాన్యం కొనుగోళ్లు

... 1వ పేజీ తరువాయి

వర్షాలు పడడంతో వడ్ల గింజల్లో శాతం అధికంగా వుంది. కోత కోసిన తరువాత మంచు దట్టంగా కురవడంతో వరి పనలు ఆరడానికి ఎక్కువ రోజులు పట్టింది. ఆరిన పనలను కుప్ప వేసిన తరువాత వెసులుబాటు చూసుకుని రైతులు నూర్పులు చేపట్టారు. అయితేప్పటికీ ధాన్యంలో తేమ 25 శాతం వరకు వుంటున్నది. కానీ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 కన్నా తక్కువ ఉంటేనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కేంద్రాల నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ప్రైవేటు వర్తకులకు తక్కువ రేటుకు అమ్ముకోవాల్సి వస్తున్నది.

లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ

జయంతి, డీఎం, జిల్లా పౌరసరఫరాల సంస్థ

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 72 కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 9,192 టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఎనిమిది వేల టన్నులకు సంబంధించి ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ అయ్యేలా ఏర్పాట్లు చేశాం. సంక్రాంతి పండుగ సెలవుల కారణంగా ధాన్యం కొనుగోళ్లు కాస్త మందగించాయి. రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తాం. లక్ష్యం మేరకు ధాన్యాన్ని సేకరిస్తాం.

ఉక్కుకు మంచి రోజులు

... 1వ పేజీ తరువాయి

చేయడానికి నిధులు అందుబాటులో లేక స్టీల్ అమ్మగా వచ్చిన మొత్తాలన్నీ సరఫరాదారులకు ఇచ్చేశారు. దాంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చింది. ఇప్పుడు కేంద్రం రూ.11,440 కోట్లు సాయం చేయడం వల్ల ముడి పదార్థాలకు నిధుల లభ్యత పెరుగుతుంది. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇచ్చే సౌలభ్యం కలుగుతుంది. గతంలో మాదిరిగానే నెలాఖరున జీతాలు అందుకునే పరిస్థితి వస్తుంది. మూడో బ్లాస్ట్ ఫర్నేస్ కూడా ఆగస్టు నుంచి ప్రారంభమవుతుందని ప్రకటించిన నేపథ్యంలో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి దిశగా కర్మాగారం ప్రయాణం మొదలవుతుంది. దీనివల్ల ఉద్యోగులకు భద్రత లభిస్తుంది.

యాజమాన్యం ప్రస్తుతం వీఆర్ఎస్‌కు దరఖాస్తులు ఆహ్వానించింది. భవిష్యత్తుపై ఆందోళనతో 370 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు ప్యాకేజీ రావడంతో అత్యధికులు వీఆర్ఎస్‌కు మొగ్గుచూపరనే వాదన వినిపిస్తోంది. అనారోగ్యం, తక్కువ సర్వీస్ ఉన్నవారు తప్పితే మిగిలిన వారు కొనసాగుతారని ఉద్యోగ సంఘాలు విశ్వాసం వ్యక్తంచేస్తున్నాయి. ఉత్పత్తికి అవసరమైన ఐరన్‌ఓర్‌ను ఎన్ఎండీసీని అందించి, అదానీ గంగవరం పోర్టు నుంచి సమస్యలు తలెత్తకుండా చూసుకుంటే అనుకున్న ఉత్పత్తి సాధిస్తామని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504